# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :03 | సంచిక : 90 | శుక్రవారం 14 | మార్చి2025 | పేజీలు: 08 | వెల రూ.5

published from : Karimnagar : circulated to : Adilabad, Warangal, Nizamabad, Warangal,Hyderabad,Khamam, Nalgonda, Mahbubnagar,Medak, Rangareddy









# జగదీశ్ రెడ్డి సస్పెన్షన్

రాష్ట్ర అసెంబ్లీలో రెండో రోజు బడ్జెట్ సమావేశం హాట్ హాట్‌గా సాగింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలాయి. ఏకంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ వరకు వ్యవహారం సాగింది. బడ్జెట్ సెషన్ ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జగదీశ్ రెడ్డిపై చర్యలకు కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. మంత్రి సీతక్క ప్రతిపాదనతో స్పీకర గడ్డం ప్రసాద్ సస్పెండ్ చేశారు.

## బడ్జెట్ సెషన్ నుంచి సస్పెండ్ చేసిన స్పీకర్

### సభ మీ ఒక్కరిదీ కాదని..

స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి వ్యాఖ్య

తీవ్ర అభ్యంతరం తెలిపిన కాంగ్రెస్ సభ్యులు

కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

అధికార పార్టీ తీరును ఖండించిన బీఆర్ఎస్

సభాపతిపై అవిశ్వాసం పెడతామన్న హరీశ్

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ సభ్యుడు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్ సస్పెండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా సభ మీ సొంతం కాదంటూ స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి మాట్లాడడం రచ్చకు దారి తీసింది. దీంతో స్పీకర్‌ను అవమానించారనే ఆరోపిస్తూ ఉప ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, అధికార పార్టీ సభ్యులు ఆందోళనకు దిగారు. అధికార పార్టీ సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ఈ క్రమంలో మంత్రులు సభాపతితో భేటీ అయ్యారు. జగదీశ్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అందరూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై జగదీశ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. స్పీకర్‌పై ..మిగతా 2లో

### చరిత్రలో చీకటి రోజు

జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

ఏకవచనంతో మాట్లాడలేదు: హరీశ్ రావు 2

### నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు

జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అక్రమమని వ్యాఖ్య

కక్షగట్టి సస్పెండ్ చేశారన్న జగదీశ్ రెడ్డి

కేసీఆర్‌ను ఎన్నో సార్లు బయటకు పంపారు

అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన 2

### మా అభిప్రాయం తీసుకోరా?

ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ జరగాలి

ఎంఐఎం నేత అక్బరుద్దీన్ 2

### పిరికిపంద చర్య ఇది

చేతగాక సస్పెండ్ చేశారు

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



### కేసీఆర్ ఆదేశించారు.. చెన్నై వెళ్తున్నాం

కేంద్రం తీరుతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

డిలిమిటేషన్‌పై స్టాలిన్‌కు సంపూర్ణ మద్దతు

డీఎంకే ఆహ్వానంపై కేటీఆర్

### లీడర్ల స్టేచర్ కాదు.. రైతుల ఫ్యూచర్ ముఖ్యం



కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలి

10 లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

ప్రభుత్వానికి కనపడటం లేదా

రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ ఫైర్ 2



### అసెంబ్లీలో కవిత బర్త్ డే

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో కేక్ కట్ చేసిన కవిత 2





### కేంద్రం నిధులపై చర్చకు సిద్ధం

మంత్రి పొన్నం సవాల్ స్వీకరించిన ఏలేటి 2

కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర వాగ్వాదం

సభను తప్పదోవ పట్టిస్తున్నారని ఏలేటి మండిపాటు

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులిస్తుందని వ్యాఖ్య

### ఫోన్ ట్యాపింగ్

## నిందితులను తీసుకురండి

కేంద్రమంత్రి జైశంకర్‌తో సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ పర్యటనలో కీలకంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు

మరింత ఒత్తిడి తీసుకురావాలని కోరిన సీఎం

అంతర్జాతీయ ప్రోగ్రామ్స్‌కు సహకరించాలని విజ్ఞప్తి

తెలంగాణ రైజింగ్ ను ప్రోత్సహించాలని వినతి



**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన వెనక ఫోన్ ట్యాపింగ్ అంశం దాగుందన్న చర్చ జరుగుతోంది. ఈకేసులో ప్రధాన నిందితులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కోరినట్టు తెలుస్తుంది. గురువారం కేంద్రమంత్రితో భేటీ సందర్భంగా ఈ అంశంపై చర్చించినట్టుగా సమాచారం. తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా సంచలనం ..మిగతా 2లో

### సునీత రాక మరింత ఆలస్యం

మరోమారు ప్రయోగం విఫలం

సునీతా విలియమ్స్‌కు విషమ పరీక్ష 2



### రేపటి నుంచి ఒంటిపూట బడులు

ఉదయం 8 నుంచి మద్యాహ్నం 12.30 వరకు తరగతులు 2

### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం



విజయశాంతి, అద్దంకి, శంకర్ ఎన్నిక

బీఆర్ఎస్ దాసోజు, సీపీఐ సత్యం కూడా

తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదు

గులాబీ బాస్‌పై విజయశాంతి విమర్శలు 2

# పిరికిపంద చర్య ఇది

- చేతగాక సస్పెండ్ చేశారు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శించారు. జగదీష్ రెడ్డి ఎక్కడా సభా గౌరవాన్ని కించపరచలేదన్నారు. రేవంత్ రెడ్డి లాగా బూతులు మాట్లాడి తగ్గించలేదన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు కూడా పాల్పడలేదని తెలిపారు. కేవలం ఏకవచనంతో మాట్లాడారన్న అపవాదుతో సస్పెండ్ చేయడం వెనుక మీ భయం, ఆందోళన కనబడుతున్నదన్నారు. ఆయన అలా మాట్లాడితే అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో మాట్లాడాల్సింది లేదా, క్షమాపణ కోరాల్సిందని.. కానీ ఏకపక్షంగా సస్పెండ్ చేయడం అధికార పార్టీ చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు.

# మా అభిప్రాయం తీసుకోరా?

- జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై ఎంఐఎం నేత అక్బరుద్దీన్

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ స్పందించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. సభ్యుడి సస్పెన్షన్ అంశంపై మాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, సభ్యుడు సరిగా మాట్లాడారా? లేదా? అనేదానిపై తమ అభిప్రాయం తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. అందరి ఫ్లోర్ లీడర్ల అభిప్రాయాలు తీసుకోవాలని కోరుతున్నానని అక్బరుద్దీన్ అభిప్రాయపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు చేయకూడదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నాను అన్నారు.

# రేపటి నుంచి ఒంటిపూట బడులు

శెనార్తి మీడియా, హైదరాబాద్ (మార్చి13): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి జనం జంకుతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం పాఠశాలల సమయంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో హాఫ్‌డే స్కూల్స్‌పై అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారని చెప్పింది. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు హాఫ్ డే ఉంటుందని.. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.



# అసెంబ్లీలో కవిత బర్త్ డే సెలబ్రేషన్స్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో కేక్ కట్ చేసిన కవిత

**శెనార్తి మీడియా, బోధన్(మార్చి 13):**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, జాగృతి కార్యకర్తలు పెద్దఎత్తున నిర్వహించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ ఛాంబర్‌లో కవిత బర్త్ డేను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్వహించారు. వారందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆమెకు కేక్ తినిపించారు. పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాగా గురువారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో కవిత పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్, జాగృతి, విభాగ సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, ప్లేట్లను పంచి పెట్టారు.



# రాష్ట్ర చరిత్రలో చీకటి రోజు

- జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం
- ఏకవచనంతో మాట్లాడలేదు
- ఇది కాంగ్రెస్ మార్క్ పాలన
- సభ బయట మాట్లాడితే కేసులు..
- లోపల ప్రశ్నిస్తే సస్పెన్షన్లు
- మాజీ మంత్రి హరీశ్ రావు

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీష్ రెడ్డి సస్పెన్షన్ పై డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో ఈరోజు చీకటి రోజని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈరోజు పట్టపగలు ప్రజాస్వామ్యం గొంతు కోసిందని మండిపడ్డారు. సభ బయట ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, సభలో ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ పాలన మార్కు అన్నారు. జగదీష్‌రెడ్డి గవర్నర్ ప్రసంగంలో తప్పులు ఎత్తి చూపే ప్రయత్నం చేశారని, ప్రతిపక్షాల హక్కులు కాపాడాలని ప్రశ్నిస్తే ఆయనను సస్పెండ్ చేశారని మండిపడ్డారు. మాట్లాడితే దళిత స్పీకర్ అని కాంగ్రెస్ నేతలు ఆయన విలువ తగ్గించే ప్రయత్నం చేసిందన్నారు. దేశంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టింది, దళితులకు రూ.10 లక్షలు ఇచ్చింది తమ పార్టీ అని పేర్కొన్నారు. అంబేద్కర్ ను ఓడించింది కాంగ్రెస్ అని, ద్రౌపది ముర్మును సోనియా అవమానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. నిజానికి జగదీష్ రెడ్డి సభలో ఏకవచనం సంబోధించలేదని, మీరు అనే పదమే వాడారని వివరించారు. 15 నిముషాల కోసం సభ వాయిదా అని, ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆడించిన నాటకం ఇదన్నారు. రేవంత్ రెడ్డి ప్లాన్.. శ్రీధర్ బాబు అమలు చేశారని మండిపడ్డారు.

# నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు
- జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అక్రమమని వ్యాఖ్య
- కక్షగట్టి సస్పెండ్ చేశారన్న జగదీశ్ రెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్

**శెనార్తి మీడియా, హైదరాబాద్ (మార్చి 13):**

అసెంబ్లీ నుంచి జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉండి.. ఇక్కడ తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో తాము తప్పు మాట్లాడి ఉంటే.. ఆ వీడియోలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తప్పు అని తేలితే తప్పకుండా విచారం వ్యక్తం చేస్తామని అన్నారు. ఏకపక్షంగా సభ నుంచి జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అనని



మాటను.. అన్నట్లుగా చిత్రీకరించారని అన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

**బండారం బయటపడుతుందనే సస్పెన్షన్: జగదీశ్ రెడ్డి**

స్పీకర్ ను కించపరిచేలా మాట్లాడలేదని, స్పీకర్ విలువ ఏంటో తనకు తెలుసని పేర్కొన్నారు. సభలో గవర్నర్ ప్రసంగంలో తప్పులు ఎత్తిచూపే ప్రయత్నం చేశానని, బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీలో ఉంటే తమ బండారం బయటపడుతుందని కాంగ్రెస్ నాయకులు చేసిన కుట్ర ఇదని మండిపడ్డారు. సభ అందరిది, సభలో అందరికీ హక్కులు ఉంటాయని చెప్పే ప్రయత్నం చేశానని అన్నారు. కావాలంటే రికార్డులు చెక్ చేసుకోవాలని. తాను ఏకవచనంతో సంబోధించలేదని వివరించారు. స్పష్టమైన కారణం లేకుండా తనపై కక్షగట్టి సభ నుంచి బయటికి పంపించారని అన్నారు. కేసీఆర్ ఒక్కడే పోట్లాడి తెలంగాణను సాధించడాని.. ఎన్నోసార్లు సభల నుంచి ఆయనను బయటికి పంపించారని.. చివరకి ఆ ఒక్కడే తెలంగాణను సాధించి చూపించాడని గుర్తు చేశారు. తనను బయటికి పంపినంత మాత్రాన తన గొంతు నొక్కలేరని.. ఇంకా బలంగా ప్రజల సమస్యలను ఎత్తి చూపుతానని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఇంతకంటే ఎక్కువే చూశామని.. ఇవేవీ తనను ఏమీ చేయలేవని జగదీష్ రెడ్డి వెల్లడించారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్**

అంతకుముందు, జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. విరిమించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎంతకూ వినకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో హరీష్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డి, కోవా లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి సహా పలువురు ఉన్నారు.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

- విజయశాంతి, అద్దంకి, శంకర్ ఎన్నిక
- బీఆర్ఎస్ దాసోజు, సీపీఐ సత్యం కూడా.!
- తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదు
- గులాబీ బాస్‌పై విజయశాంతి విమర్శలు

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

రాష్ట్రంలోని ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన జారీ చేశారు. ఏకగ్రీవం అయిన ఎమ్మెల్సీలకు ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా విజయశాంతి, దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సత్యం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. నామినేషన్లు సరిగా దాఖలు చేయని కారణంగా అవి తిరస్కరించబడ్డాయి.



దీంతో ఈ ఐదుగురు ఏకగ్రీవం అయ్యారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు రాగా.. వాటిలో ఒకటి పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించింది. ఫలితంగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌లు.. సీపీఐ నుంచి సత్యం నామినేషన్ వేశారు. బీఆర్ఎస్‌కు ఒక స్థానం రాగా.. ఆ పార్టీ నుంచి దాసోజు శ్రావణ నామినేషన్ దాఖలు చేశారు. కాగా వీరంతా ఏకగ్రీవం అయినట్టు ఈసీ ప్రకటించింది.

**కేసీఆర్ సొత్తు కాదు: ఎమ్మెల్సీ విజయశాంతి**

ఎమ్మెల్సీలపై ప్రకటన అనంతరం మీడియాతో విజయశాంతి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదని మండిపడ్డారు. ఆరోజు టీడీపీ మంత్రి పదవి ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఎత్తుకున్నారన్నారు. తాను తెలంగాణ కోసం ఉద్యమాలు చేస్తున్నప్పుడు ఆయన టీడీపీలో ఉన్నాడని గుర్తు చేశారు. తన తల్లి తెలంగాణ పార్టీని విలీనం చేయమని కేసీఆరే వెంటపడ్డారని, పార్లమెంట్ లో తెలంగాణ కోసం ఇద్దరమే కొట్లాడుతున్నప్పుడు ఆయన మాత్రం ఎందుకు ఎగ్జిట్ అయ్యారని నిలదీశారు. కేవలం దొరలు ఓట్లు వేస్తేనే కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బడుగు, బలహీన వర్గాలకు గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలన్నారు. తెలంగాణ కేసీఆర్ ఒక్కడి వల్లే రాలేదని 1200 మంది అమరులైతే తెలంగాణ వచ్చిందని, అంతేగాని తెలంగాణ కేసీఆర్ ఒక్కడి సొత్తు కాదని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యతిరేక శక్తులను బీజేపీ ఈ రాష్ట్రంలో దింపాలని చూస్తోందని మళ్లీ దొరా బాంచన్ నీ కాళ్లు మొక్కుతా అనే పరిస్థితిని బీజేపీ మళ్లీ తీసుకురాబోతోందని వెల్లడించారు. అందుకే ఉద్యమ నాయకులను అణచివేస్తున్నారని అన్నారు. బీజేపీలో ఉంటే మాకు ఏం గౌరవం ఇచ్చారని, తాను ఆ పార్టీలోనుంచి ఎందుకు బయటికి రావాల్సి వచ్చిందో ఆలోచించుకోవాలని సూచించారు.

# కేంద్రం నిధులపై చర్చకు సిద్ధం

- మంత్రి పొన్నం సవాల్ స్వీకరించిన ఏలేటి

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

శాసనసభలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. మంత్రి పొన్నం ప్రభాకర్ ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే బీజేపీ నాయకులపై పొన్నం తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణాకు కేంద్రం అన్యాయం చేస్తుందని, రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను సైతం ఇవ్వడం లేదని విమర్శించారు. దీనిపై ఎవరైనా చర్చకు వస్తారేమో రండి అంటూ రాష్ట్ర బీజేపీ నాయకులకు పొన్నం సవాల్ విసిరారు. పొన్నం ప్రభాకర్ సవాల్ ను స్వీకరిస్తున్నా అంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ‘ పొన్నం ప్రభాకర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం ద్వారా జరుగుతున్నాయి. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన నిధులపై చర్చ జరపాలని మేము కూడా డిమాండ్ చేస్తున్నాం’ అని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీనికి కౌంటర్‌గా తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసిందని పొన్నం ప్రభాకర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణకు కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చిందో రాష్ట్ర బీజేపీ లేఖ విడుదల చేయాలి. మూసీకి నిధులు ఇవ్వాలి, మూసీకి నిధులు ఇవ్వాలి. కరీంనగర్ నుంచి మంచిర్యాల వరకూ రైల్వే లైన్ ఇవ్వాలి. తెలంగాణ కోసం ప్రత్యేకమైన ప్యాకేజ్ ఇచ్చేలాగ రాష్ట్ర బీజేపీ ప్రయత్నం చేయాలి’ అని పొన్నం స్పందించారు.

# జగదీశ్ రెడ్డి సస్పెన్షన్

**మొదటి పేజీ తరువాయి**

ఇంత అహంకారంగా మాట్లాడటం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో స్పీకర్ చైర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, దీనిపై సీరియస్ నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకుని జగదీశ్ రెడ్డి స్పీకర్‌ను బెదిరిస్తున్నారని.. ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఏడాదిలో ఏం చేయాలో చేసి తమ సత్తా చూపించామన్నారు. ఏం చేయబోతున్నమో కూడా చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగగా.. సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం సభ తిరిగి ప్రారంభం అయ్యాక.. మంత్రి సీతక్క ప్రతిపాదనతో జగదీశ్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తమ సభ్యుడిని అకారణంగా చేయని తప్పునకు సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ పార్టీ మండిపడుతోంది. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటికి వెళ్లిపోయారు. సచివాలయం రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అయితే జగదీష్ రెడ్డి స్పీకర్ ను అగౌరవపరిచేలా మాట్లాడిన అంశాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ సభ్యులు కోరినట్టు సమాచారం.

**స్పీకర్‌పై అవిశ్వాసం పెడతాం: హరీశ్**

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం పెడతామన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి అక్షింతలు వేయడంతో.. ఈరోజు సభలో కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, ‘సభ మీ ఒక్కరిదీ కాదు, సభ అందరదీ అని’ జగదీష్ రెడ్డి అన్నారని, మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మీ ఒక్కరిదీ అనే పదం అన్ పార్లమెంటరీ పదం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీయదని.. సభను ఎందుకు వాయిదా వేశారో తెలీదని అన్నారు. కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడిరదని, స్పీకర్‌ను కలిశామని, రికార్డు తీయాలని అడిగామన్నారు. దళితుడుని అగౌవరం పరిచే విధంగా జగదీష్ రెడ్డి మాట్లాడలేదన్నారు. 15 నిమిషాల అయినా వీడియో రికార్డు స్పీకర్ తెప్పించలేదని, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాట్లాడకుండా బ్లాక్ చేశారని హరీష్ రావు అన్నారు.

# లీడర్ల స్టేచర్ కాదు.. రైతుల ఫ్యూచర్ ముఖ్యం

- రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ ఫైర్

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రైతు భరోసా ఇవ్వడం లేదని, రుణమాఫీ పూర్తి చేయరని, పంట నష్ట పరిహారం ఇవ్వరని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాకుండా... రైతుల ఫ్యూచర్ గురించి ఆలోచించాలని అన్నారు. అసెంబ్లీలో రైతు సమస్యలపై చర్చించాలని బండి సంజయ్ సూచించారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలని... యాసంగి పూర్తయ్యేంత వరకు నీళ్లు వదలాలని కోరారు. కాలువల్లో నీళ్లున్నా ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు. 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి అన్నదాతల ఆక్రందనలు వినిపించడం లేదని సంజయ్ మండిపడ్డారు. ప్రతి విషయాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టేసి రేవంత్ ప్రభుత్వం తప్పించుకోవాలనుకుంటోందని విమర్శించారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని అన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, ఎల్లంపల్లి, ఎల్‌ఎండీ, సింగూరు సహా రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో 340 టీఎంసీలకుపైగా నీటి నిల్వ ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇందులో 150 టీఎంసీల మేరకు డెడ్ స్టోరేజీ పోగా, మరో 190 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉందని, తాగునీటి అవసరాలకు మినహాయించి మిగిలిన నీటిని సకాలంలో విడుదల చేసి చెరువులు నింపినట్లయితే పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తేది కాదని ఆయన పేర్కొన్నారు.

# సునీత రాక మరింత ఆలస్యం

- మరోమారు ప్రయోగం విఫలం
- సునీతా విలియమ్స్‌కు విషమ పరీక్ష

**శెనార్తి మీడియా, వాషింగ్టన్ (మార్చి13):**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారతీయ అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురయింది. తొమ్మిది నెలలుగా ఐఎస్ఎస్‌లో ఉంటున్న ఆమె భూమి మీదికి రావడం మరింత ఆలస్యమయ్యేలా ఉంది. ఐఎస్ఎస్ నుంచి సునీతతో పాటు బచ్ విల్మోర్‌ను భూమిపైకి తీసుకొచ్చేందుకు నాసా స్పేస్ ఎక్స్ సంయుక్తంగా చేపట్టిన క్రూ 10 మిషన్‌లో భాగంగా గురువారం జరగాల్సిన ప్రయోగం వాయిదా పడింది. అమెరికాలోని ఎలోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం నిలిచిపోయింది. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య రావడంతో దీనిని ఆపేసినట్లు నాసా వెల్లడించింది. శుక్ర లేదా శనివారాల్లో ఈ ప్రయోగాన్ని తిరిగి నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. కాగా, షెడ్యూల్ ప్రకారం ఈ ప్రయోగం మార్చి 25న జగాల్సి ఉంది. అయితే నాసా దానిని ముందుకు జరిపినా.. అది వాయిదా పడింది.

# కేసీఆర్ ఆదేశించారు.. చెన్నై వెళ్తున్నాం

- డీఎంకే ఆహ్వానంపై కేటీఆర్

**శెనార్తి మీడియా, హైదరాబాద్(మార్చి 13):**

జనాభా ఆధారంగా కేంద్ర ప్రభుత్వం చేయాలనుకుంటున్న డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించేందుకు డీఎంకే నేతలు హైదరాబాద్ వచ్చారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ, నీటి సరఫరా మంత్రి కేఎన్. నెహ్రూ, రాజ్యసభ ఎంపీ ఎన్.ఆర్. ఎలాంగో బృందం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో సమావేశం అయ్యారు. అనంతరం రెండు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాల్సిన సందర్భం ఇది అని పిలుపునిచ్చారు. సమిష్టిగా పోరాడితే తప్పకుండా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని కేటీఆర్ చెప్పారు. భారత ప్రభుత్వ సూచన మేరకు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలుచేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించాలనుకోవడం దారుణమని అన్నారు. 1970 80 దశకంలో ఫ్యామిలీ ప్లానింగ్ బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ స్థానాలను కొత్తగా వచ్చిన సెన్సెస్ ప్రకారం నిర్ణయిస్తామనడం అన్యాయమని, ఫలితంగా పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టాలిన్ ఏర్పాటుచేస్తున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ తరపున హాజరుకావాలని కేసీఆర్ ఆదేశించారని.. 22న జరిగే సమావేశానికి హాజరై బీఆర్ఎస్, తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. డీఎంకే బృందం మాట్లాడుతూ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మొదటి నుంచి ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అందుకే అన్ని పార్టీలతో చెన్నైలో సమావేశం ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సమావేశంలో అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

# నిందితులను తీసుకురండి

**మొదటి పేజీ తరువాయి**

సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. విదేశాల్లో ఉన్న ఫోన్‌ట్యాపింగ్ నిందితులను ఇక్కడికి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు చేయాలని కోరినట్లుగా సమాచారం. తమ రాష్ట్రంలో ఫోన్‌ట్యాపింగ్ కేసు నమోదయినప్పటి నుంచి వారిని ఇక్కడికి తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. రెడ్ కార్నర్‌నోటీసులు జారీ చేశామని, ఇంటర్ పోల్ సాయం తదితర వాటి ద్వారా ప్రయత్నించామన్నారు. అయినా అటు వైపు నుంచి స్పందన లేకపోవడంతో కేంద్రం మరింత ఒత్తిడి తీసుకవచ్చి మన దేశ చట్టాలకు అనుగుణంగా ఇక్కడికి తీసుకువచ్చే ప్రయత్నాలు చేయాలని కోరినట్లుగా తెలుస్తుంది. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే "ఇండియా జాయ్" వివరాలను కేంద్ర మంత్రి జైశంకర్ దృష్టికి సీఎం తీసుకెళ్లారు. కార్యక్రమాల నిర్వహణ ద్వారా "తెలంగాణ రైజింగ్"ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని మంత్రిని సీఎం కోరారు.

### కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి కాదు..

# చర్చకు రావాలి

- కేసీఆర్ వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారు
- బీఆర్ఎస్ పాలనలో ఒక్క పాలసీని తేలే
- కాంగ్రెస్ పాలనలో చేసినన్ని పాలసీలు ఎవరూ చేయలే
- సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,మార్చి13: మాజీ సీఎం కేసీఆర్ చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే ఏం లాభమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకవేళ చర్చకు వస్తే వారే చేసిన తప్పులేంటే వివరించే అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రజలకు తెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే అర్థం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవహార శైలిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ ఒక్క పాలసీ తేలేదన్నారు. తెలంగాణలో తాను చేసినన్ని పాలసీలు ఎవ్వరూ చేయలేదని పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి నాటి నుంచి రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకి తెచ్చినట్లు వెల్లడించారు. పన్ను వసూళ్లలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందంటూ రేవంత్ తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్?లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని, ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ అన్నారు. తానేవరూ తెలికుండానే పీసీసీ, ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారా? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. గాంధీ కుటుంబంతో తనకు విబేధాలు వచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు రేవంత్. తెలంగాణ సీఎంగా ఉన్నా కాబట్టే రాష్ట్రంలో తనను ప్రశ్నిస్తున్నారని, అలాగే కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు కాబట్టే ఆయన్నీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన అంశాలపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. మిగతా రాష్ట్రాల కేంద్రమంత్రులు వారివారి రాష్ట్రాలకు కావాల్సినవన్నీ సాధించుకుంటున్నారని, కానీ కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాను ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, తెలంగాణకు ప్రధాని ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో, మూసీ, కేంద్ర ప్రాజెక్టులు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పుకొచ్చారు. మెట్రోకి క్యాబినెట్ అనుమతి వస్తే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు. హైదారాబాద్ గేమ్ ఛేంజర్ మెట్రో అంటూ రేవంత్ చెప్పుకొచ్చారు.

## హోలీతో పాటు..రంజాన్ శుక్రవారం

ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

హైదరాబాద్,మార్చి13: 35 ఏళ్ల తర్వాత హోలీ పండుగ, రంజాన్ మాసములోని రెండవ శుక్రవారం ఒకే రోజు వచ్చాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. రెండు పండుగలు సజావుగా జరిగేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ సిటీ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జోన్ లోని సున్నితమైన, ముఖ్యమైన ప్రాంతాలలో పికెట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలని పోలీసు అధికారులకు కోరారు. అసాంఘిక శక్తులపై, వెగాబాండ్ లపై గట్టీ నిఘా ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. రంగుల హోలీ తమ జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని సీవీ ఆనంద్, డీజీ కమిషనర్ ఆఫ్ పోలీసు తెలిపారు. భాగ్యనగర వాసులకు హోలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ (అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్), చైతన్య కుమార్ పాల్గొన్నారు.

## తెలంగాణలో 'భారత్ సమ్మిట్'

న్యూఢిల్లీ,మార్చి13: తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 'మిస్ వరల్డ్' పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు .విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు దిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తానెవరో తెలియ కుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్‌లోనూ తాను పడనన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారు కాబట్టే రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు సాధించుకొని రావాలని తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. మిగతా రాష్ట్రాల కేంద్ర మంత్రులు వారి స్టేట్స్ కు కావాల్సినవి సాధించు కుంటున్నారని చెప్పారు. కిషన్ రెడ్డి మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాను ప్రధానిని ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన అడుగుతున్నానని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులపై విన్నవిస్తున్నట్టు చెప్పారు. మెట్రోకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే పనులు మొదలవుతాయని అన్నారు. మెట్రో విస్తరణ హైదరాబాద్ కు గేమ్ చేంజర్‌గా మారనుందని అన్నారు. పదేండ్లలో కేసీఆర్ ఒక్క పాలసీ కూడా తేలేదని, తాను చేసినన్ని ఎవరూ చేయలేదని అన్నారు. నిరుద్యోగాన్ని 8.8 శాతం నుంచి 6.2శాతానికి తగ్గించగలిగానని అన్నారు. 2.2 లక్షల కోట్ల పెట్టుడులు తెలంగాణకి తెచ్చామని వివరించారు.

# ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

- సమావేశాలు ముగిసేవరకు వేటు
- జగదీశ్ రెడ్డి తీరుపై మండిపడ్డ మంత్రులు
- దళిత స్పీకర్‌ను అవమానించడం దారుణమన్న సీతక్క
- ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి 13: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి శాసనసభ నుంచి సస్పెండ్ అయ్యారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సస్పెండ్ అయిన సభ్యుడిని సభ నుంచి బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించారు. కాగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. 'మీరు మేము ఎన్నుకుంటేనే స్పీకర్ అయ్యారు. సభ మీ ఒక్కరిదీ కాదు – సభ అందరిదీ' అని స్పీకర్‌ను ఉద్దేశించి జగదీష్ రెడ్డి అన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు జగదీష్ వ్యాఖ్యలపై శాసనసభలో వాడీవేడీ చర్చ జరిగింది. సభ లోపల, బయట స్పీకర్ నిర్ణయాన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఏకవచనంతో స్పీకర్‌పై మాట్లాడటం బాధాకరమన్నారు. స్పీకర్‌ను అవమానించకుండా ఆదర్శంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని.. అప్పటి వరకు ఈ సేషన్ మొత్తం ఆ సభ్యున్ని సస్పెండ్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈరోజు సభ్యుడు మాట్లాడిన భాష అత్యంత అవమానకరమన్నారు. ఒక దళితజాతి బిడ్డ స్పీకర్‌గా మాట్లాడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని.. స్పీకర్‌ను టార్గెట్ చేయడం బాధాకరమన్నారు. ఆ సభ్యుని సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. జగదీష్ రెడ్డి మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. బలహీన వర్గాలు ఇప్పుడిప్పుడే ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం వచ్చాక... బీఆర్ఎస్ అడిగినన్ని సార్లు అవకాశం ఇచ్చారన్నారు. జగదీష్ రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. మీకు మీకు అని మాట్లాడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. గవర్నర్‌ను పట్టుకుని కాంగ్రెస్ కార్యకర్త అని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గవర్నర్ మాట్లాడింది.. తమ ప్రభుత్వ విధానం అని కేసీఆర్ సభలో చెప్పలేదా అని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌ను దారుణంగా అవమానించారన్నారు. జగదీష్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని స్పీకర్‌ను కోరుతున్నాని మంత్రి సీతక్క తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ ప్రసంగం సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లను సస్పెండ్ చేశారన్నారు. పార్లమెంట్‌లో టీఎంసీ సభ్యుడు ప్రవర్తన సరిగా లేనందున సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. జగదీష్ రెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. సభ్యులు చర్చ అనంతరం జగదీష్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.అయితే సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరగా.. అందుకు స్పీకర్ అనుమతి ఇవ్వక పోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు వచ్చేశారు. సస్పెండ్ అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కూర్చున్న జగదీష్ రెడ్డిని అసెంబ్లీ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కోరారు. అయితే సభా వ్యవహారాల నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని చీఫ్ మార్షల్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు వాదించారు. ఏ రూల్ ప్రకారం బయటికి పంపాలని చూస్తున్నారని అడిగి రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పారు. దీంతో చీఫ్ మార్షల్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



### సస్పెన్షన్ ఏకపక్ష నిర్ణయం: హరీష్ రావు



హైదరాబాద్,మార్చి13: సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. జగదీశ్ రెడ్డిని ఈ సెషన్ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించగానే.. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉరిశిక్ష వేసేటప్పుడు కూడా చివరిసారిగా మాట్లాడేందుకు అవకాశం ఇస్తారు సర్.. మీరు ప్రధాన ప్రతిపక్షానికి మీరు మైక్ ఇవ్వరా సర్ అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సభలో మాట్లాడేందుకు మాకు ఎందుకు అవకాశం ఇవ్వరని హరీశ్‌రావు సభాపతిని ప్రశ్నించారు.స్పీకర్ నిర్ణయాన్ని నిరసిస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వచ్చారు. తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బయటకు వచ్చిన జగదీశ్ రెడ్డి కేసీఆర్ ఛాంబర్‌లో కూర్చున్నారు. అక్కడ్నుంచి కూడా వెళ్లిపోవాలని చీఫ్ మార్షల్ జగదీశ్ రెడ్డికి సూచించారు. సభ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ సభ్యులు చీఫ్ మార్షల్‌కు సూచించారు. ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరమేంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

### ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో దుర్మార్గాలను ఎదుర్కొన్నం

**ఈ సస్పెనషన్ ఓ లెక్క కానేకాదు: జగదీశ్ రెడ్డి**

హైదరాబాద్,మార్చి13: ఉమ్మడి రాష్ట్రం నుంచి ఎన్నో దుర్మార్గాలను ఎదుర్కొని వచ్చామని.. ఈ సస్పెన్షన్ తనను ఏమాత్రం భయపెట్టలేదని సూర్యాపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులతో కలిసి అంబేద్కర్ భారీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ రోజు రాష్ట్రంలో ఏం జరుగుతుందో.. శాసనసభలో ఏం జరుగుతుందో ప్రజలంతా చూశారు. మేం మాట్లాడుతున్న సందర్భంలో దురదృష్టవశాత్తు.. శాసనసభలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన సభ్యులు మాట్లాడుతున్న దాన్ని లైవ్ కూడా ఇవ్వడం లేదని ప్రజలు మాకు చెబుతున్నరు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం నిజాలు దాచిపెడుతామనుకుంటే సాధ్యం కాదని అన్నారు. శాసనసభలో ఒక్కరోజు కూడా అన్‌పార్లమెంటరీ వర్డ్ కానీ, ఇతరులను కించపరిచేవిధంగా, శాసనసభ హుందా తనాన్ని తగ్గించే విధంగా కానీ నేను ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రత్యేకించి చైర్‌కు సంబంధించి.. స్పీకర్ అధికారాలు ఏందో.. స్పీకర్ విధులు ఏంటో అన్నీ నాకు తెలుసు. ఎక్కడా కూడా స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే పద్ధతుల్లో మాట్లాడలేదు. ఇది కేవలం ప్రభుత్వ కుట్ర. ఈ చర్యకు స్పీకర్ సమ్మతిస్తరని నేను అనుకోవడం లేదు. ఎంత దురదృష్టకరమంటే.. జరిగింది చర్చ నాకు, కాంగ్రెస్ పార్టీకి మధ్యన. స్పీకర్ పెద్దమనిషిగా.. రెఫరీగా ఉంటారు కాబట్టి.. ఆయనను పదేపదే రిక్వెస్ట్ చేశాను. కాంగ్రెస్ సభ్యులు ఇద్దరు 1.20గంటలు మాట్లాడారు. అప్పుడు మా సభ్యులు అభ్యంతరం తెలుపలేదు.. వారు సాఫీగా మాట్లాడుకున్నరు' అని తెలిపారు.స్పీకర్ నాకు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ తరపున మాట్లాడేందుకు కేసీఆర్ నాకు అవకాశం ఇచ్చారు. నేను దానికి సంబంధించి రాత్రి జిల్లాలోని రైతులు, అన్నివర్గాల ప్రజలతోని మాట్లాడాను. వాళ్ల సమస్యలను ఎలా ప్రతిబింబించాలి.. రాష్ట్రంలో ఎండిపోతున్న పొలాలు, అక్కడ రైతులు చెబుతున్న బాధలు.. వివిధ వర్గాల ప్రజలు ఎలా మోసపోయామని చెబుతున్నరో.. వాటన్నింటిని శాసనసభలో మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశాను. అందులో ఎక్కడా ఒక్క తప్పుమాట, పొరపాటు మాట.. స్పీకర్‌ను కించపరిచే మాట లేదు. ప్రభుత్వాన్ని నిలదీసే మాట ఉంది. ప్రభుత్వం బట్టలు విప్పే మాట ఉంది.. ఉండి తీరుతుందని అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షంగా మా బాధ్యత అన్నారు. శాసనసభలో ఆపినంత మాత్రానా.. ప్రజాక్షేత్రంలో మమ్మల్ని ఆపలేరు' అని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

### ఉద్దేశ్యపూర్వకంగా

## సస్పెండ్ చేశారు

- మీడియా పాయింట్ వద్ద కెటిఆర్ ఆరోపణ

హైదరాబాద్,మార్చి 13 :

జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ తర్వాత భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదు. అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్త య్యే వరకు ఆయన్ను సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా జగదీశ్‌రెడ్డికి ఇవ్వలేదు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయాలని, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆదేశించాలన్నారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టంగా చెప్పాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరాం. అయినా, పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటల పాటు వాయిదా వేశారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని కేటీఆర్ అన్నారు.

## రేవంత్‌కు మతిభ్రమించింది

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్,మార్చి13: సీఎం రేవంత్‌రెడ్డికి మతి భ్రమించిందని, ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్ట్రెచర్ మీద ఉన్నది కేసీఆర్ కాదు, నువ్వు.. అవును ముమ్మాటికీ 'నువ్వే' అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆర్ఎస్పీ అన్నారు. తన వినూత్న ఆలోచనాయుధాలతో తెలంగాణ సమాజానికి విముక్తి కల్పించి, మరో ప్రపంచం వైపు పరుగులు పెట్టించిన ఆ పోరాట యోధున్ని ఎదుర్కోలేక, కేవలం శాపనార్థాలు అనే స్ట్రెచర్ మీద తెలంగాణ లో తచ్చాడుతున్నది నువ్వు అని రేవంత్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ప్రజలు ఇచ్చిన అరుదైన అవకాశాన్ని వారికోసం వినియోగించే ఇంగింత జ్ఞానం కూడా లేని అజ్ఞానివి నువ్వు. నీ లాంటి వారిని ఉంచాల్సింది సచివాలయం, శాసనసభల్లో కాదు, సైకోలుగా మారిన మనుషులను మార్చే మానసిక చికిత్సాలయాల్లో. కేసీఆర్‌కు మీకు పోలికే లేదు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ.. నీ లాగా మార్చురీల భాష మాట్లాడే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదు. కేసీఆర్ కూడా వాటిని ఎంకరేజ్ చేయరని నాకు మెల్లమెల్లగా అర్థమైతున్నది. నేను స్వయంగా చూసిన ఒక విషయం మీకు చెబుతా వినండి. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన చాలా పార్టీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. ఏ రోజు కూడా ఆయన మీ పేరు ఎత్తి, మీ ప్రస్తావన కూడా తేలేదు. వారి ప్రసంగాలన్నీ ఆద్యంతం తెలంగాణ ప్రజల అమాయకత్వం, ఆవేదన, వారి భవిష్యత్తు, ఇంకా అసంపూర్తిగా ఉన్న ఎన్నో కలలు, బీజేపీ–కాంగ్రెస్ విధానాల వల్ల తెలంగాణ ప్రజలకు అన్ని రంగాల్లో జరుగుతున్న నష్టం, బీఆర్ఎస్ పార్టీ పాటించాల్సిన వ్యూహం, ప్రజలకోసం చేయాల్సిన పోరాటం చుట్టే తిరిగేవి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. రోజూ మీరు మీ యాంటీరూంలోకి ఒంటరిగా వెళ్లి అద్దం ముందు నిలబడి గట్టిగా మీ ప్రతిబింబంతో మీ సిగ్నేచర్ మార్చురీ భాష మాట్లాడండి. మీ ప్రతిబింబం నిజంగా నిజాయితీగా ఒప్పుకుంటే అదే భాష ముందు మీ కుటుంబంలో వాడండి.. మారండి లేదా ఆసుపత్రిలో చేరండి అని సూచించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతులు ఆనందంగా ఉండేలా పథకాల అమలు
- సీతారామ ప్రాజెక్టుతో 3లక్షల ఎకరాలకు సాగునీరు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం,మార్చి13: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. 'ప్రతి రైతు ఆనందంగా ఉండాలి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారులు వెంటనే స్పందించాలి' అని సూచించారు. అలాగే, 'రైతు భరోసా పథకం కింద ఈ నెలాఖరు వరకు రూ.10 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాం' అని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నాం అని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు చేరనున్నాయి. అలాగే, శ్రీరామ చంద్రుని కృపతో కొద్ది నెలల్లోనే గోదావరి జలాలను సాగు కోసం వినియోగించగలమని తెలిపారు. జిల్లా సత్తుపల్లి మండలం యతాల కుంట గ్రామంలో సీతారామ టన్నెల్ వద్ద వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై విశేషాలు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో సత్తుపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉందని, తాను రాజకీయ చైతన్యం వచ్చినప్పటి నుండి అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో రోడ్డు మార్గాలను విస్తృతంగా అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ప్రతి గిరిజన గ్రామానికి రహదారులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్య కోసం పిల్లలు స్కూల్స్‌కు సులభంగా వెళ్లగలిగే పరిస్థితి రావడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజలకు నమ్మకం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదని మంత్రి అభిప్రాయపడ్డారు. సత్తుపల్లిలో ఎలాంటి సమస్యలు లేవని, స్థానిక ఎమ్మెల్యే రాగమయి ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'పంటలు లాభసాటిగా ఉండేలా హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలి. హార్టికల్చర్ చేయలేని స్థితిలో ఉంటే వరి పండించండి' అని సూచించారు. ఫామాయిల్ ధర గతంలో రూ.1200గా ఉండేదని, ప్రస్తుతం అది రూ.20,800కి పెరిగిందని తెలిపారు. అలాగే, ఉగాది నాటికి ఖమ్మం జిల్లాలోని కల్లూరు గూడెంలో ఫామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. ఖమ్మం నుంచి రాజమండ్రికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ఆగస్టు 15నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీనితో రవాణా వ్యవస్థ మరింత మెరుగు పడుతుందని, వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. 'నా మొట్ట మొదటి కోరిక సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడమే' అని మంత్రి తెలిపారు.

## అప్పులున్నా అభివృద్ధి ఆగడం లేదు

**బిజెఎల్‌పి నేత ఏలేటి వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం**

హైదరాబాద్,మార్చి13:తెలంగాణ శాసన సభలో బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ విధానాలపై బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. మంత్రిల మాట్లాడుతూ, 'మేము ఏ పథకాన్ని నిలిపివేయలేదని స్పష్టంగా చెప్పగలము. ప్రభుత్వం కొత్త ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు విద్యాబోధన సక్రమంగా అందించాలని సూచిస్తున్నాం' అని చెప్పారు. నిజానికి అప్పులు ఉన్నాయనే విషయం మాకు తెలుసు. తెలంగాణ ఆర్థికంగా ఎదిగిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ పరిపాలన అనుభవం కలిగినది, పాత పథకాలను కొనసాగించడంతోపాటు కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నాం' అని వివరించారు. మంత్రి బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ, 'కేంద్రం పెద్దన్న లాగా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలి. బీజేపీ నేతలు తులం బంగారం గురించి మాట్లాడుతున్నారు. 15 లక్షలు అందిస్తామని చెప్పారు, ఏమైపోయాయి? రైతులకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు, కానీ వారి కోసం ఉరి చట్టాలు తీసుకొచ్చారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు' అని దుయ్యబట్టారు. రాష్ట్రం నుండి వచ్చే నిధులను కేంద్రం తిరిగి ఇవ్వడం లేదు. రేషన్ షాపులపై బీజేపీ నేతల ఫోటోలు పెట్టాలని చెబుతున్నారు' అని మంత్రి మండిపడ్డారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద

# మాటల యుద్ధం



- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మండిపాటు
- సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, మార్చి13: అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. స్టేచర్ అంశంపై ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదంటూ హస్తం నేతలు హెచ్చరికలు జారీ చేశారు. సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారని కాంగ్రెస్ నేతలు తెలుపగా.. రేవంత్ రెడ్డిని పిచ్చికుక్కలతో పోల్చారు బీఆర్ఎస్ శ్రేణులు. ఇంతకీ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎవరెవరు ఏం మాట్లాడాలో చూద్దాం.

**కేటీఆర్ హుందగా మాట్లాడాలి : ఆది శ్రీనివాస్**

కేటీఆర్ హుందగా మాట్లాడాలని రాజకీయాల్లో హుందగా నడుచుకుంటేనే బాగుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. స్టేచర్ గురించి ముందు మాట్లాడింది కేటీఆర్ అని.. సీఎం పదవి కంటే స్టేచర్ ఇంకేమైనా ఉంటుందా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. "కేటీఆర్ మీకు నాయకుడు కావొచ్చు కానీ సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారన్నారు. తెలంగాణలో సీఎం పదవి కంటే ఇంకేమి స్టేచర్ ఉండదని స్పష్టం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు పదవులు తీసుకొని వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అందుకే ప్రజలు మీ స్టేచర్ను దింపి... సీఎంగా రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. 'హరీష్ రావు మీ నోరును అదుపులో పెట్టుకోండి. ఇష్టనుసారంగా మాట్లాడితే ఇక్కడ ఎవరు చూసుకుంటూ ఊరుకోరు.. 10 ఏళ్లు పందికొక్కులాగా రాష్ట్రాన్ని దోచుకున్న మీరు మాట్లాడుతున్నారా. ఈ రోజు 18 గంటలు కష్టపడి సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలి" అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

**సీఎంను అగౌరవపర్చే విధంగా**

**హరీష్‌రావు మాటలు : బీర్ల ఐల్లయ్య**

హరీష్‌రావు ముఖ్యమంత్రి కుర్చీని అగౌరవపరిచే విధంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేశారని.. తెలంగాణ ప్రజానీకం గమనిస్తోందని తెలిపారు. ప్రజా ప్రతినిధుల్లా కాకుండా పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, ముఖ్యమంత్రి అంటే బీఆర్ఎస్‌కు విలువలేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టే స్థాయి లేని వారు ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. వీళ్ళు పది సంవత్సరాలు చేయని అభివృద్ధిలో 15 నెలల్లో చేస్తే తల ఎక్కడ పెట్టుకోవాలో తెలుస్తలేదన్నారు. 'మీలా దొంగ దీక్షలు చేయలేదు. పెట్రోల్ దొరికినా అగ్గిపెట్టె దొరకలేదు అనే విధంగా మేము చేయలే. ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారు.. నోరు అదుపులో పెట్టుకో. మీ బలుపు, వాపు మీ దగ్గరే పెట్టుకోండి. హరీష్ రావు తస్మాత్ జాగ్రత్త బిడ్డ. నిన్ను గ్రామాల్లో తరిమికొట్టే రోజులు ముందు ఉన్నాయి. మీరు చేసిన తప్పులు, అప్పులు సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. ఇది చూసి ఓర్వలేకే దిగజారుడు రాజకీయాలు. ఈరోజు రాష్ట్రం దివాలా తీయడానికి కారణం మీ మామ అల్లుళ్లు. సిగ్గులేకుండా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి' అంటూ ఐలయ్య డిమాండ్ చేశారు.

**సీఎం పదవి పరువుతీస్తున్న రేవంత్**

**: పాడి కౌశిక్ రెడ్డి**

ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ సీఎం పదవి రేవంత్ రెడ్డి తీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. ఇలానే మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతోందన్నారు. 4వేల పెన్షన్ వస్తుంది అనుకుంటే ఇప్పుడు 4 ఎకరాల పంట ఎండిపోతుంది అనుకోలేదని చిన్నపిల్లవాడు చెప్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. పంటలు ఎండిపోతుంటే కనీసం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో వచ్చిన కరెంటు, రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద ఉన్న కక్ష్యతోనే పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతోందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీళ్లు వదలకపోతే రైతులను తీసుకొని తాను రోడ్డెక్కుతా అని హెచ్చరించారు. కేసీఆర్ కంటే గొప్ప పాలన చేసే ప్రయత్నం చేయాలి కానీ ఇలాంటి పరిస్థితులు రాకూడదన్నారు. 15 నెలల స్కాంగ్రెస్ పాలన.. 15 నెలలు 15 స్కాములు జరిగాయన్నారు. ఈ స్కాంగ్రెస్ పాలలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరును ప్రజలు చూస్తున్నారన్నారు. 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ అభివృద్ధిని దేశానికి చూపెట్టారు కేసీఆర్ అని అన్నారు. సిగ్గు, శరం లేకుండా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారని మండిపడ్డారు. సభా ప్రతిపక్ష నేత చావు కోరుతున్నారన్నారు. వందల మంది ఎల్ఓపీ లీడర్లు అయ్యారు కానీ ఎవరు కూడా చావును కోరుకోలేదన్నారు. మొరిగే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని.. కొండను చూసి కుక్కలు మొరిగితే కొండకు చేటా అని అన్నారు. 'కేసీఆర్ చావాలని నువ్వు కోరుకుంటున్నావు. కానీ కేసీఆర్ చచ్చే వ్యక్తి కాదు తెలంగాణను చావు నోట్లో తలపెట్టి తెచ్చిన వ్యక్తి కేసీఆర్. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా.. ఈ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత అయ్యేవాడా. నీకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆర్ అనే విషయం గుర్తు పెట్టుకో' అని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలు పెడుతున్న శాపనార్థాలకు కుక్క చావు చచ్చేది రేవంత్ రెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. రైతులు రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తే ఆ జర్నలిస్టును బెయిల్ రాకుండా కేసులు పెట్టి జైలుకు పంపించారని.. ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. 'నువ్వు సక్కగా పాలన చేస్తే జర్నలిస్టులు రైతులు నిన్ను తిట్టేవారు కాదు కదా. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి' అంటూ పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### రేవంత్ అలా మాట్లాడటం సబబు కాదు : గంగుల కమలాకర్

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పట్ల సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడటం ఎంత వరకు కరెక్టు అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. '2009 నుంచి నేను అసెంబ్లీలో ఉన్న. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ లాంటి సీఎంలను చూశాను. రేవంత్‌రెడ్డి లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా చూస్తున్న. చంద్రబాబు నాయుడు లాంటి నేతలను చూశాం. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి లాగా చూస్తున్నడు. కానీ మేము తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిగా చూస్తున్నాం. కేసీఆర్‌ను చావాలని కోరుకుంటావా? రేవంత్ రెడ్డిని ఒక వ్యక్తిగా చూడలేదు. నిన్ను ఒక సీఎంగా చూస్తున్నాం. తెలంగాణ సీఎం అని రేవంత్ రెడ్డి అనుకుంటే పితృ సమానులైన కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి. ఒక తండ్రిలాగా ఉన్న కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదు. తెలంగాణ సమాజానికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి' అంటూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

- సిఎం రేవంత్

న్యూఢిల్లీ,మార్చి13: కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు తీసుకుని డిఎంకె నిర్వహించే జెఎసి సమావేశానికి హాజరవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్ కారణఃఘా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రఅన్యాయం జరుగబోతోందని అన్నారు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్ కూడా అఖిలపక్ష భేటీని ఏర్పాట చేసిందన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించామని అన్నారు. కేంద్ర కేబినేట్‌లో ఉన్న కిషన్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ఇబ్బందులను కేంద్రానికి తెలియచేయాల్సి ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేంవత్‌ని ఈ నెల 22న జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తమిళనాడు డీఎంకే నేతలు ఆహ్వానించారు. ఈ క్రమంలో జేఏసీ సమావేశానికి రేవంత్ రెడ్డి రావాలని డీఎంకే ఎంపీలు కనిమొళి, రాజా, ఎన్. ఇలాంగో, కళానిధి వీరస్వామి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. స్టాలిన్ డీలిమిటేషన్ విషయంలో చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమిళనాడులో సమావేశానికి హాజరయ్యేందుకు ఏఐసీసీ అనుమతి తీసుకుని వస్తామన్నారు. డీలిమిటేషన్ పక్రియ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందని, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా డీలిమిటేషన్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా రావాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి తన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాల్సిన అవసరం ఉందని రేవంత్ ప్రస్తావించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు కూడా ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై మార్చి 22న జరుగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందింది. తమిళనాడులో జరగనున్న ఈ సమావేశానికి పలు ప్రాంతీయ పార్టీలు హాజరై డీలిమిటేషన్ పై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నాయి. ఇప్పటికే డీలిమిటేషన్ పై తమిళనాడు డీఎంకే నేతలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ పక్రియ తమ రాష్ట్రంలో ప్రజల హక్కులను హరించే దిశగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ కూడా ఈ అంశంపై చర్చిస్తామన్నారు. దీంతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ముఖ్యమైన చర్చలకు ఒక వేదికగా నిలిచే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాల ప్రగతికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునేందుకు కీలక అంశంగా మారనుంది. డీలిమిటేషన్ వల్ల వచ్చే రాజకీయ పరిణామాలు, రాష్ట్రాల మధ్య సంబంధాలు, వాస్తవాలపై ప్రాధాన్యం కలిగిన అనేక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ భేటీకి మరికొన్ని రోజుల సమయం ఉన్న నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం

హైదరాబాద్,మార్చి13: మేము ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలతోపాటు పార్టీలో కీలకంగా పనిచేసిన వారికి ఇచ్చిన మాటను నిబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు రానివారికి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తానని హామీ ఇచ్చానని.. అవన్నీ ఇప్పుడు అమలు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి ఒకేసారి 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చానన్నారు. అలాగే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చామన్నారు. డీసీసీ అధ్యక్షులందరికీ పదవులు ఇచ్చామని తెలిపారు. గాంధీ కుటుంబంతో తనకు అనుబంధం అంతకు మించి ఉందని.. ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న నిర్మలా సీతారామన్ గతంలో తమిళనాడుకు మెట్రో ప్రకటనలో కీలక పాత్ర పోషించారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణ రాష్ట్రం అంశాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తామన్నారు. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిస్తే సరిపోతుందని.. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఏప్రిల్ నెలలో మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 దేశాల నుంచి అతిథులను ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి అనుమతి కావాలని.. అందుకే విదేశాంగ శాఖ మంత్రిని కలుస్తున్నట్లు తెలిపారు. డీలిమిటేషన్ విధానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు. దానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామన్నారు.

# సభ అందరిదీ.. మీ సొంతం కాదు

- స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు
- అసెంబ్లీలో దుమారం
- బేషరతు క్షమాపణలకు కాంగ్రెస్ డిమాండ్
- గందరగోళం మధ్య సభ 15 నిముషాలు వాయిదా

హైదరాబాద్,మార్చి13: తెలంగాణ అసెంబ్లీలో భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరపున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు. ఈ క్రమంలో దళిత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా మండిపడ్డారు. దళితులంటే బిఆర్ఎస్‌కు పడదని, అందుకే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని అధికార పార్టీ సభ్యులు గట్టిగా డిమాండ్ చేసారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ సభను 15 నిముషాలు వాయిదా వేశారు. అంతకుముందు మంత్రి కోమటి రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య కాసేపు మాటల తూటాలు పేలాయి. పదేళ్లలో ఏమీ చేయలేని బిఆర్ఎస్..ఇవాళ కాంగ్రెస్‌ను తప్పుపడుతోందని మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. రుణమాఫీ, రైతుభరోసాపై ప్రభుత్వం విమర్శలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి కామెంట్స్ కు మంత్రి కోమటి రెడ్డి కౌంటర్ ఇచ్చారు.రైతు భరోసా ఎప్పుడిచ్చారు, రుణమాఫీ ఎక్కడ చేశారు. ఆడపిల్లలకు స్కూటీ ఇచ్చారు. గవర్నర్ 36 నిమిషాల ప్రసంగంలో 360 అబద్ధాలు చెప్పారు. ప్రతిపక్షాలు మాట్లాడుతుంటే అధికార పార్టీ నేతలు రన్నింగ్ కామెంట్రీ చేయడం మానుకోవాలని జగదీష్ రెడ్డి సూచించారు. జగదీష్ రెడ్డి కామెంట్స్ కు మంత్రి కోమటి రెడ్డి కౌంటర్ ఇచ్చారు. దళితుడిని సీఎం చేస్తామని బీఆర్ఎస్ చేసిందా? మూడెకరాల భూమి ఇస్తామని ఇచ్చిందా? ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ పూర్తి చేసినవేనన్నారు. బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తాం. మీరు పదేళ్లలో చేయలేనిది..తాము 14 నెలల్లో చేశామని కోమటిరెడ్డి అన్నారు.

### మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతకరం

- స్పీకర్‌ను అవమాననించారంటూ ఆందోళన
- క్షమాపణలు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి13: సభ మీ సొంతం కాదంటూ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం రచ్చకు దారి తీసింది. ఈ క్రమంలో మంత్రులు సభాపతితో భేటీ అయ్యారు. జగదీష్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అందరూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. స్పీకర్‌పై ఇంత అహంకారంగా మాట్లాడటం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో స్పీకర్ చైర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, దీనిపై సీరియస్ నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకుని జగదీష్ రెడ్డి స్పీకర్‌ను బెదిరిస్తున్నారని.. ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఏడాదిలో ఏం చేయాలో చేసి తమ సత్తా చూపించామన్నారు. ఏం చేయబోతున్నమో కూడా చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం పెడతామన్నారు. నిన్న ముఖ్యమంత్రి అక్షింతలు వేయడం.. ఈరోజు సభలో కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీష్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, 'సభ మీ ఒక్కరిదీ కాదు – సభ అందరదీ అని' జగదీష్ రెడ్డి అన్నారని, మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మీ ఒక్కరిదీ అనే పదం అన్ పార్లమెంటరీ పదం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీయదని.. సభను ఎందుకు వాయిదా వేశారో తెలీదని అన్నారు. కాంగ్రెస్ డిపెన్స్‌లో పడిందని, స్పీకర్‌ను కలిశామని, రికార్డు తీయాలని అడిగామన్నారు. దళితుడుని అగౌవరం పరిచే విధంగా జగదీష్ రెడ్డి మాట్లాడలేదన్నారు. 15 నిమిషాల అయినా వీడియో రికార్డు స్పీకర్ తెప్పించలేదని, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాట్లాడకుండా బ్లాక్ చేశారని హరీష్ రావు అన్నారు.

### కావాలనే కాంగ్రెస్ నాయకుల రాద్ధాంతం

**జగదీశ్‌రెడ్డి మాటలను వక్రీకరించే యత్నం : తలసాని**

హైదరాబాద్,మార్చి13: అసెంబ్లీలో అందరికి సమాన హక్కులు ఉంటాయన్న జగదీశ్‌రెడ్డి మాటలను కాంగ్రెస్ నాయకులు వక్రీకరిస్తూ, అనవసర రాద్ధాంతానికి తెర తీస్తున్నారని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ సభ్యులే స్పీకర్‌ను అవమానించినట్లుగా మాట్లాడుతున్నారని, ఆ పార్టీ నేతల మాటలు విచిత్రంగా ఉన్నాయని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. స్పీకర్ అంటే తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. కేసీఆర్‌కు ఛాంబర్ లేకుండా చేసినా తాము భరించామని.. పీఏసీ చైర్మన్ మాకు వచ్చేదైనా వారే గుంజుకున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ స్ట్రెచర్‌పై ఉన్నారని, మార్చురీకి వెళ్తారని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా ఎదుటివారి చావు కోరుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గడ్డం ప్రసాద్ గౌరవప్రదమైన పోస్టులో ఉన్నారన్నారు. ఆయనను వ్యక్తిగా చూశామని, ఆయన కులం, మతం చూడలేదన్నారు. తాము సభకు రావొద్దని అనుకుంటున్నారా?.. చెబితే తాము ఆలోచిస్తామన్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. సభలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారని, సభలో అందరూ సమానమే అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. తాము స్పీకర్‌ని అమానించలేదన్నారు. నిన్న రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను డైవర్ట్ చెయ్యడానికి ఇవన్నీ మాట్లాడుతున్నారన్నారు. రైతులకి ఇచ్చిన హామీలు ఏమి అమలు చేశారు.. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించినందుకు మా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లోనూ మమ్ములను మాట్లాడకుండా చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ఒక్కరూ కాదు 20 మంది ఎమ్మెల్యేలు మంది ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన అదనపు కలెక్టర్



**శెనార్తి మీడియా, కరీంనగర్**

జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాములను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపుతున్నామని తెలిపారు. ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. గోదాంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది హాజరు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈవీఎం గోదామ్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఏఓ సుధాకర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ప్రయోజనాలకు యూ.డీ.ఐ.డి కార్డు



**శెనార్తి మీడియా, కరీంనగర్**

దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజనాలను పొందేందుకు యూ.డీ.ఐ.డి (యూనిక్యూ డిస్ఎబిలిటీ ఐడెంటిటీ) కార్డు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే దివ్యాంగ గుర్తింపు సర్టిఫికెట్ ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, వారికి యూ.డీ.ఐ.డి కార్డు పోస్టులో నేరుగా పంపబడుతుందని తెలిపారు. కొత్త దరఖాస్తుదారులు www.swavlambancard.gov.in వెబ్‌సైట్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 రకాల అంగవైకల్యం ఉన్నవారికి ఈ కార్డు జారీ అవుతుందని, దరఖాస్తు చేసిన అనంతరం వైద్య పరీక్షల ద్వారా అర్హత నిర్ధారించి కార్డు మంజూరు చేస్తారని వివరించారు. ఎవరికీ డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే 9490881098 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఈవో జనార్ధన్, అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వింధ్యవాలీ హైస్కూల్లో హోలీ రంగుల పండుగ



**శేనార్తి మీడియా, కరీంనగ**

స్థానిక మేహార్ నగర్ లోని వింధ్యవాలీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు, హోలీ రంగుల పండుగను ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆనందాల డోలిక అత్యంత వేడుకగా కుంకుమ, గులాలు, రంగుల నీరు, పూలు, ఒకరిపై ఒకరు చల్లుకొని, కేరింతలు చప్పట్లతో పాటలు పాడుతూ, ఉత్సాహంగా ప్రేమాభిమానాలు, సౌభాగ్యాలు, వెల్లి విరిసేలా గడిపారు. ఈ పండుగ పాల్గొన మాసం వసంత రుతువు, పూర్ణిమ రోజున హోలికను పూజిస్తే బాధలు తొలగిపోతాయని, చెడుపై మంచి విజయం సాధించడం అనేది ఈ పండుగ అంతరార్థం. మనిషిలోని చెడు ప్రవర్తనను అంతంచేసి మంచిని పెంచే పండుగగా భావిస్తారు. ఈరోజు పిడకలు పాత వస్తువులతో కామ దహనం చేస్తారు. కాబట్టి కాముని పూర్ణిమ అని కూడా అంటారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ శ్రీమతి రామవరం లక్ష్మీ ప్రకాష్ రావు, వైస్ చైర్మన్ పృథ్వీ రావు, ప్రిన్సిపాల్ శ్రీ. జి. ప్రశాంత్ పాల్గొని, మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగలు విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తూ, ఆచార సంప్రదాయాలు మరవకూడదని ఉద్బోధించారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తొలగింపు

**శెనార్తి మీడియా, గన్నేరువరం**

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో మండలం లోని గునుకుల కొండాపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగ పూరి శంకర్ ను పదవి నుండి తొలగించినట్లు మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.గునుకుల కొండాపూర్ గ్రామంలో త్వరలోనే నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిని నియమిస్తామని ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో కంగన్ హాల్ వస్తువులు దగ్ధం

**శెనార్తి మీడియా, శంకరపట్నం**

▪ 25 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడి ఆవేదన



శంకరపట్నం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో గురువారం ముద్ర కోలా గోపి ఇంట్లో షాట్ సర్క్యూట్ తో కంగన్ హాల్ వస్తువులు దగ్ధమయ్యాయి . బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి . శంకరపట్నం మండలం లింగాపుర్ గ్రామానికి చెందిన ముద్ర కోళ్ల గోపి కోన్నెళ్లుగా గ్రామాలలో కంగన్ హాల్ వస్తువులు అమ్ముతుంటారు. ఫ్రిడ్జిలు, కుర్చీలు, కూలర్లు, మిక్సీలు , రైస్ కుక్కర్లు,



తదితర వస్తువులతో పాటు కంగన్ హాల్ వస్తువులు అమ్ముతుంటారు , అమ్ముకునేందుకు ఇంట్లో వస్తువులను నిలువ చేశాడు, విక్రయించేందుకు భార్యతో పాటు గోపి ఇతర గ్రామాలకు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో మంటలు అంటుకోవడంతో గమనించిన చుట్టుపక్కల వారు గోపికి సమాచారం అందించారు . గోపి తో పాటు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించగా , సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది లింగాపూర్ చేరుకునే వరకు అప్పటికే 1లక్ష 20 వెల నగదు తో పాటు కంగన్ హాల్ వస్తువులు 5 తులాల బంగారం 20 తులాల వెండి అగ్ని ప్రమాదానికి కాలిపోయాయి. సుమారు 25 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపాడు . కాగా కేశవపట్నం పోలీసులతోపాటు ఆర్ ఐ బాలకిషన్ లింగాపూర్ చేరుకొని వివరాలు సేకరించారు.

## అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

**శెనార్తి మీడియా, కరీంనగర్**

అక్రమ అరెస్టులతో ప్రజా సంఘాల ఉద్యమాలను ఆపలేరని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు గురువారం రోజున సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ దగ్గర ధర్నా జరుగుతున్న సందర్భంగా ముందు రోజు నుండే ప్రజా సంఘాల కార్యకర్తలు, నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారుఢిల్లీ సరిహద్దుల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రత్మక పోరాటానికి తలొగ్గి రైతు




వ్యతిరేక చట్టాలను వెన్నిక్కి తీసుకుంటామని రాత పూర్వకంగా హామీ ఇచ్చి మళ్ళీ ఇప్పుడు రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అలాగె ఉద్యమం సందర్భంగా అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ఇంత వరకు ఎత్తి వేయలేదని,రైతుల పంటల గ్యారంటీ హామీ చట్టం తేవడంలో,రైతు పండించిన పంటలకు కనీస మద్దత్తు ధర అమలు కావడం లేదని, రైతాంగం శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు కొమ్ము కాయకుండా రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని, రైతు ఏడ్చిన రాజ్యం ఎక్కడ మనుగడ సాధించలేదని, రాతపూర్వకంగా హామీ ఇచ్చిన 3 చట్టాలను వెంటనే ఉప సంహారించుకోవాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, కనీస మద్దత్తు ధరల చట్టం,పంట కొనుగోలు గ్యారంటీ చట్టం అమలు చేయాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

## హైటెక్నాలజీ ధోభీఘాట్‌లు ఏర్పాటు చేయాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రజక వృత్తి ఇప్పటికీ పాత పద్ధతులను అనుసరిస్తూ కొనసాగుతుందని, దీనిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర యూత్ గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎల్లన్న అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరు తరహాలో హైదరాబాద్‌తో పాటు 141 మున్సిపాలిటీలలో హైటెక్నాలజీ ధోభీఘాట్‌లు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తంగెల్లపల్లి తిరుపతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో తల్లి మృతి



▪ కూతురు ఆసుపత్రిలో చికిత్స

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లా కేంద్రంలోని చున్నబట్టి వాడకు చెందిన పస్తం పోచమ్మ (80), తన కూతురు పస్తం రాజమ్మ (35)తో కలిసి ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని జీవనం సాగిస్తోంది. బుధవారం సాయంత్రం మద్యం సేవించిన తల్లి, కూతురుకు ఇంట్లో గొడవ జరిగిందని, అదే సమయంలో గుర్తుతెలియని పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయారని స్థానికులు తెలిపారు. వారి మనవడు భీమేష్ చుట్టుపక్కల వారి సహాయంతో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పోచమ్మ మృతి చెందింది. రాజమ్మ ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. మద్యం మత్తులో గొడవ జరిగి, అనుకోకుండా పురుగుమందు తాగినట్లు భావిస్తున్నామని పస్తం గంగారం ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాస్టర్‌కు ఆర్థిక సహాయం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ భూమయ్య నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, నడుము భాగానికి శస్త్రచికిత్స అవసరమైంది. ఆపరేషన్ ఖర్చు రూ. 2 లక్షలు కావడంతో ఆయన ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు 25 వేల రూపాయలు సమీకరించి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, కోశాధికారి కనపర్తి రమేష్ చేతుల మీదుగా భూమయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, సీనియర్ మాస్టర్లు హరికృష్ణ, సురేష్, ప్రసాద్, రమేష్ రాజా, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా దుకాణంలో చోరీ



**శెనార్తి మీడియా, శంకరపట్నం**

శంకరపట్నం మండలం వంకాయ గూడెం గ్రామంలో కిరాణా దుకాణంలో దొంగతనం జరిగినట్లు స్థానికులు తెలిపారు. కిరాణా దుకాణంలో మహిళా సంఘాలకు సంబంధించిన 12 వేల నగదు క్యాష్ కౌంటర్ లో 600 వందల నగద్ ను దొంగలు కిరాణా దుకాణం తలుపులకు ఉన్న గొల్లన్ని ఊడదీసి కౌంటర్ లో దాచిన సొమ్మును దొంగలు దోచుకెళ్ళారు.గురువారం తెల్లవారుజామున కిరాణా దుకాణంలోకి వెళ్లిన షాప్ యజమానికి తలుపులు తీసి ఉండడంతో దొంగతనం జరిగినట్లు అనుమానం కలిగి పోలీసులకు సమాచారం అందించారు.దొంగతనం జరిగిన కిరాణా దుకాణాన్ని కేశవపట్నం ఎస్సై రవి పరిశీలించారు.

## ఆధునిక పద్ధతుల్లో సాగుతో అధిక లాభాలు



**శెనార్తి మీడియా, చొప్పదండి**

నాబార్డ్ వారి సౌజన్యంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలోని మల్లన్నపల్లిలో కూరగాయలు సాగు చేసే 25మంది మహిళా రైతులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ జీడిమెట్లలో ఉన్న ఆర్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్ కు క్షేత్ర ప్రదర్శనకు గురువారం వెళ్లారు.ఈ సందర్భంగా సెంటర్ అడ్మిన్,హార్టికల్చర్ ఆఫీసర్ జలంధర్ మాట్లాడుతూ కూరగాయల సాగులో మల్టీ క్రాప్ మెథడ్స్,పందిరి కూరగాయలు వీటితోపాటు ఆకుకూరలు వేసవికాలంలో మల్చింగ్,డ్రిప్పు పింక్ కలర్ ఇరిగేషన్ ద్వారా రైతులు పంటలు పండించాలన్నారు.ఎస్సీ,ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ,ఎస్సీలకు,బీసీలకు 90శాతం సబ్సిడీతో ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్పులను అందించడం జరుగుతుందన్నారు.ఈ డ్రిప్పు ద్వారా నీటి ఆదాతో పాటు కూరగాయల్లో మంచి నాణ్యమైన దిగుబడి ఫెటిగేషన్ చేయడం ద్వారా కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చని పిలుపునిచ్చారు.హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు టమాట సాగులో స్టేకింగ్,హైడ్రోపోనిక్ పద్ధతులను హైటెక్ నర్సరీలను వాటి ద్వారా రైతులకు వంద శాతం సబ్సిడీ మీద మొక్కలను అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో పెండ్లి సంపత్ కుమార్,జన వికాస స్టాఫ్ కోఆర్డినేటర్ రాజు పెసరి,సోమేశ్వర్ తోట మనిషా, సుష్మ వీరితోపాటు 25మంది మహిళ రైతులతోపాటు ఫ్యాక్స్ డైరెక్టర్ పద్మ తదితరులు హాజరయ్యారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం కార్యకర్తలు



**శెనార్తి మీడియా, మహాదేవ్ పూర్**

మహాదేవ్ పూర్ మండలంలోని సూరారం గ్రామంలో తలారి రాజలింగం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇటీవల మరణించారు. దీంతో ఐటీ శాఖ మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియూ వారి సోదరుడు శ్రీను బాబు ఆదేశాల మేరకు మృతుడి దశదినకర్మ కార్యక్రమానికి సూరారం గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామలోని కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసి మీకుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తులసి మహేష్, చల్ల మహేష్, ములకల రవి, సాగర్, దుర్గం విశాక్ ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి 'భవిత' విద్యార్థికి ప్రొఫైల్ సిద్ధం చేయాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్**

జిల్లాలోని భవిత కేంద్రాలలో ప్రత్యేక విద్య అభ్యసిస్తున్న ప్రతి దివ్యాంగ విద్యార్థికి ప్రొఫైల్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిత విద్యార్థుల తల్లిదండ్రులకు యూ.డీ.ఐ.డి కార్డులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు అన్ని భవిత సెంటర్లను సందర్శించి, దివ్యాంగ విద్యార్థులు తమ పనులు తాము చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక ఉపకరణాలు, ఆట పరికరాలు, ఇతర సౌకర్యాలను సమకూర్చుతామని తెలిపారు. మేనరిక వివాహాల అనర్థాలు, గర్భిణిగా ఉన్నప్పుడు టీఫా స్కాన్ ద్వారా పొందే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవిత కోఆర్డినేటర్ ఆంజనేయులు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఐ.ఈ.ఆర్.పిలు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత బ్యాంకింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శెనార్తి మీడియా, కరీంనగర్**

ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ద్వారా ఉచిత బ్యాంకింగ్, ఫైనాన్స్ శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఈ శిక్షణకు అర్హులైన నిరుద్యోగులు మార్చి 15 నుంచి ఏప్రిల్ 08 వరకు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శిక్షణలో పాల్గొనడానికి బీసీ – A, B, D కేటగిరీలకు చెందిన, 26 సంవత్సరాల లోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలి. ఎంపిక కోసం ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. శిక్షణ అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సూచించారు.

## ట్రాఫిక్ అవగాహన పార్కుతో ప్రమాదాల నివారణ



**శెనార్తి మీడియా, కరీంనగర్**

తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో గల పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె పరిశీలించి, అధికారులకు పలు సూచనలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ అవగాహన పిల్లల్లో చిన్నతనం నుంచే పెంపొందితే ప్రమాదాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ట్రాఫిక్ పార్క్‌లో అన్ని రకాల ట్రాఫిక్ బోర్డులు, గుర్తులు, సిగ్నల్స్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అదనంగా, నమూనా ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించే బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రతి గుర్తు గురించి పిల్లలకు సమగ్రంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అదేవిధంగా, పార్కు డివైడర్లలో పూల మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పార్కులోని క్యాంటీన్‌ను పరిశీలించారు. స్వశక్తి కేంద్రాల ద్వారా క్యాంటీన్ నిర్వహణ సాధ్యసాధ్యాలను అధికారులు అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రవాణా శాఖ కమిషనర్ పురుషోత్తం, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవిఐ రవికుమార్, తహసిల్దార్ విజయ్, ఎంపీడీవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి హుండిని బహుకరించిన ప్రసాద్

**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి



దాదాపు 15వేల రూపాయల విలువ చేసే హుండీని అదే గ్రామానికి చెందిన గూళ్ల ప్రసాద్ మౌనిక కుటుంబ సభ్యులు గురువారం బహుకరించినట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గుళ్ళ కనకయ్య,ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు గుళ్ల బాలయ్యలు తెలిపారు.ఆలయానికి హుండీ ఇవ్వాలని కోరగానే పెద్ద మనసు చేసుకొని వెంటనే స్పందించిన గూళ్ళ ప్రసాద్ మౌనిక కుటుంబ సభ్యులకు ముదిరాజులు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులపై ఉండాలని అమ్మవారిని కోరారు.ఈనెల 15న ఆలయంలో శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం పెద్దలు కోరారు.ఈ కార్యక్రమంలో గుల్ల రవి, గుళ్ళ బాలయ్య,హనుమడ్ల సత్యనారాయణ,పిల్లి వేణు, కదారి రాయమల్లు కుల సంఘం సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేయాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం**



గీతాకార్మీకులకు సుమారు 20 నెలలు గా పెండింగ్ లో ఉన్న 14 కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గునుకుల కొండాపూర్ లో ఆయన మాట్లాడారు. తాడి కార్పొరేషన్ ద్వారా గతంలో దెబ్బలు తగిలిన వారికి తక్షణ సహాయం కింద పదిహేను వేలు, చనిపోయిన వారికి దహన సంస్కారాల కు 25వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం ఆ డబ్బులను బాధితులకు ఇవ్వటం లేదని, తిరిగి పునరుద్దించాలని ఆయన కోరారు. వృత్తిని ప్రోత్సహించి చెట్టు ఎక్కే ప్రతి గౌడ కార్మికునికి విడుదలవారీగా సేఫ్టీ కిడ్స్, రక్షణ కవచం అందరికీ ఒకే విడతలో పంపిణీ చేయాలన్నారు. వనాల పెంపకానికి 560 జీవో ప్రకారం 5 ఎకరాల భూమి కేటాయించాలని గీతా వృతిపై దాడులు చేస్తున్న నార్కోటిక్ పోలీసుల దాడులను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. రోజు రోజుకు గీతా కార్మికుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని, రాష్ట్రంలో ఏదో ఒక దగ్గర గీతా కార్మికులు చెట్టుపై మరణిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే సేఫ్టీమోకులను అందించాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ట్యాంక్ బండ్ మీద ఏర్పాటు చేయాలని కోరారు.

## పాఠశాలలో వార్షికోత్సవం

**శెనార్తి మీడియా,శంకరపట్నం**




శంకరపట్నం మండలంలోని మెట్టుపల్లి (వెంకటేశ్వర్లపల్లె) గ్రామంలో గల ఎంపీపీ ఎస్ పాఠశాలలో గురువారం రోజున ఉపాధ్యాయ బృందంఆధ్వర్యంలో వార్షికోత్సవమును నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఏం లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణు కుమార్ లతో పాటు విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, తరగతులు, వంటశాల, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా వారిని సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలనీ, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలనీ కలెక్టర్ సూచించారు. అనంతరం, విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకోండి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని**

హోలీ పండుగను శాంతి, సమరసతా వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. హోలీ సందర్భంగా ఎవరికీ ఇబ్బంది కలిగించకూడదని, మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలని ప్రజలను కోరారు. సహజసిద్ధమైన రంగులను మాత్రమే వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఎంత మాత్రం అనుమతించబడదని స్పష్టం చేశారు. పండుగ అనంతరం చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లకూడదని, అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో, వ్యక్తులపై రంగులు చల్లడం, గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు రామగుండం పరిధిలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## హోలీ పండుగ పటిష్ట బందోబస్తు



**శెనార్తి మీడియా, కరీంనగర్**

హోలీ పండుగ సందర్భంగా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఆయన పలు సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించారు. ప్రార్థన మందిరాలు, జంక్షన్ల వద్ద కేటాయించబడిన సిబ్బందిని, బందోబస్తును స్వయంగా పరిశీలించారు. హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. హోలీ పండుగ రోజున ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా, రోడ్లపై పండుగ నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని ఆయన సూచించారు. కమిషనరేట్ ప్రజలందరికీ కరీంనగర్ పోలీస్ శాఖ తరపున పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

చొక్కరావ్‌పల్లి వైపు నుంచి గన్నేరువరం మండలానికి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గురు వారం స్వాధీనం చేసుకున్నారు. గన్నేరువరం ఎస్ఐ తాంద్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... సుమారు నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో చొక్కరావుపల్లి వైపు నుంచి గన్నేరువరం తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన గంటా కొమరయ్యను పట్టుకొని, అతని వాహనాన్ని తనిఖీ చేయగా నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికాయని ఎస్సై తెలిపారు. కొమురయ్యను పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, ఆటోను సీజ్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## హోలీ సందర్భంగా ప్రజలకు మంచిర్యాల పోలీసుల సూచనలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

హోలీ పండుగ సందర్భంగా ప్రజలు శాంతి భద్రతలను పాటించి, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జరుపుకోవాలని మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు సూచించారు. హోలీ పేరుతో రోడ్లపై సంబంధంలేని వ్యక్తులపై రంగులు చల్లడం, గుంపులుగా ర్యాలీలు నిర్వహించడం వంటి చర్యలను పోలీసులు ఖండించారు. మద్యం సేవించి రోడ్లపై అల్లర్లు సృష్టించినా, వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని స్పష్టంచేశారు. హోలీ పండుగను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, ఇతరులకు అసౌకర్యం కలిగించకుండా జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## దివ్యాంగులకు యు.డి.ఐ.డి. కార్డు అవసరం





**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని దివ్యాంగులు తప్పనిసరిగా యునిక్ డిసెబిలిటి ఐడి (యు.డి.ఐ.డి.) కార్డు పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత సదరం సర్టిఫికెట్‌కు బదులుగా యు.డి.ఐ.డి. పొందేందుకు అర్హులు www.swavlambanacard.gov.in పోర్టల్ లేదా మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మార్చి 2025 నుంచి 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి పత్రాలు పొందేందుకు యు.డి.ఐ.డి. పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేయాలని చెప్పారు. అర్హులైన లబ్దిదారులకు కార్డును పోస్టు ద్వారా నేరుగా అందించడంతో పాటు, అవసరమైన వారు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్ కలిగిన దివ్యాంగులు రాష్ట్రంలోని పింఛన్లు, ఇతర ప్రయోజనాలను పొందేందుకు యు.డి.ఐ.డి. అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఆర్.ఎం.ఓ. భీష్మ, మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు, ప్రాజెక్టు మేనేజర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మీ–సేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఆనందయ్య జాతరకు సర్వం సిద్ధం



**శెనార్తి మీడియా, బెజ్జంకి**

బెజ్జంకి మండలం బేగంపేటలోని సంగమేశ్వర ఆలయ సన్నిధిలో నిర్వహించే సద్గురు శ్రీ ఆనందయ్య జాతర మహోత్సవానికి గ్రామస్తులు అన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా హోలీ పర్వదినాన జాతర ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. దైవాంస సంబంధులైన శ్రీ సద్గురు ఆనందయ్య గ్రామ నడిబొడ్డున మఠం నిర్మించుకొని ఆవాసం ఉన్నారని, ప్రజలను పట్టిపీడించే మొండి వ్యాధులను నయం చేస్తూ, కష్ట సుఖాలలో తోడు నీడగా నిలిచారని పూర్వీకులు చెబుతారు. స్వయంగా శివ భక్తుడైన ఆనందయ్య మఠంను ఆనుకొని సంగమేశ్వర ఆలయాన్ని నిర్మించినట్లు, శివలింగాన్ని ప్రతిష్టించి ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారని ప్రచారంలో ఉంది. లోక కళ్యాణార్థం మఠంలో సమాధైన సద్గురు ఆనందయ్యను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా హోలీ పర్వదినాన జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శివలింగానికి అభిషేకం, విశేష పూజలతో అలంకరిస్తారు. తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదాలు వితరణ చేపడతారు. సాయంత్రం వేళ ఆలయం చుట్టూ రథోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉమ్మడి కరీంనగర్ తో పాటు వరంగల్ మెదక్ ,నాందేడ్, పూనే నుంచి భక్తులు, ఆనందయ్య శిష్యులు జాతరలో పాల్గొంటారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారమైన సంగమేశ్వర ఆలయ సన్నిధిలో దాతల సహకారంతో విశ్రాంతి గదులు, విద్యుత్, ఇతర సౌకర్యాలు సమకూరుడం విశేషం.

## నిబద్ధత చాటుకున్న ఎల్బీ నగర్ ఎస్ఐ నర్సయ్య



**శెనార్తి మీడియా, హైదరాబాద్**

ఈ రోజుల్లో ఫోన్ పోయిందంటే .. మర్చిపోవలసిందే. పోలీసుల దగ్గరకు వెళ్లినా దొరుకుతుందన్న నమ్మకం లేదు. ఈ నేపథ్యంలో దొరికిన ఫోన్‌ను దాని వివరాలు తెలుసుకుని మరి సంబంధిత వ్యక్తికి అందజేశారు ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ నర్సయ్య. లక్షన్నర విలువ చేసే ఫోనును వారికి అందజేసి విధి నిర్వహణలో తన నిబద్ధతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని కర్మాన్ ఘాట్‌కు చెందిన రవి కిశోర్ కొన్ని రోజుల క్రితం కెనడా నుంచి నగరానికి వచ్చారు. ఈ క్రమంలోనే పది రోజుల క్రితం తన మొబైల్‌ను పోగొట్టుకున్నారు. ఈ ఫోన్ ఆక్టోపస్ కానిస్టేబుల్ వెంకట్ నాయక్‌కు దొరకడంతో.. దాన్ని ఎస్ఐ నర్సయ్యకు అందజేశారు. అయితే ఆ ఫోన్ డిటెయిల్స్ ఏమీ లేకపోవడంతో.. సాంకేతికతను ఉపయోగించి పది రోజుల పాటు కష్టపడి.. చివరకు బుధవారం ఆ ఫోన్ తాలుకా వ్యక్తిని కనుగొన్నారు. గురువారం స్టేషన్‌కు రవి కిశోర్‌ను పిలిపించి సీఐ వినోద్ కుమార్ సమక్షంలో ఎస్ఐ నర్సయ్య అందజేశారు. తన ఫోన్ తిరిగి తనకు లభించడంతో రవి కిశోర్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సీఐ వినోద్, ఎస్ఐ నర్సయ్యకు, వెంకట్ నాయక్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సమయస్ఫూర్తిగా స్పందించాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఎస్ఐలతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఏదైనా సంఘటన జరిగిన వెంటనే స్పందించి, ఘటనాస్థలికి చేరుకోవడం ఎంతో కీలకమని సూచించారు. తొందరగా స్పందిస్తే విలువైన సమాచారం సేకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, సమర్థతతో విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందని వివరించారు. సిబ్బందికి సహాయంగా ఉండాలని, వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు సూచించాలని అధికారులను ఆదేశించారు. స్వీయ రక్షణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా ఘటనకు ఒంటరిగా కాకుండా మరొకరితో కలిసి వెళ్లాలని సూచించారు. పరిస్థితులను అంచనా వేసుకుని, అవసరమైన నిర్ణయాలు త్వరితగతిన తీసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా చొరవ చూపితేనే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు.

# ఎంపీలు, ఎమ్మెల్యేల తీరుపై ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ విడుదల



- కొందరు నాయకులతో పార్టీకి భారీగా నష్టం
- వారు బయటకుపోతే తప్పిదే
- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు
- రాజాసింగ్ లేఖపై సర్వత్రా చర్చ

హైదరాబాద్,మార్చి13: పార్టీలో కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖను రిలీజ్ చేశారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ ముఖ్యమంత్రితో కొందరు నేతలు రహస్య సమావేశాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి మీటింగ్లు పెట్టుకుంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. కేంద్ర అధికారులు గమనించాలన్నారు. తెలంగాణ హిందూ సేఫ్‌గా ఉండాలంటే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. బీజేపీ గవర్నమెంట్ రావాలంటే పాత సామాను బీజేపీ నుంచి బయటికి వెళ్లి పోవాలన్నారు. కేంద్ర అధికారులు దీనిపైన ఆలోచన చేయాలని కోరారు. ఇది నా పార్టీ.. నా అయ్యా పార్టీ అనేవాళ్లు తెలంగాణలో చాలామంది ఉన్నారన్నారు. వాళ్లని రిటైర్ చేస్తేనే తెలంగాణలో బీజేపీకి మంచి రోజులు వస్తాయన్నారు. ఇది తాను కాదు ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ అధికారులు, కార్యకర్తలు ఇదే అనుకుంటున్నారని లేఖలో రాజాసింగ్ పేర్కొన్నారు. గతంలో కూడా బీజేపీని ఒకే సామాజిక వర్గానికి వ్యక్తులు శాసిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం అంతా కూడా రెడ్డి సామాజిక వర్గం చేతిలో ఉందంటూ బాహాటంగానే వ్యాఖ్యలు చేశారు. బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో కిషన్ రెడ్డి ఒకే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు అప్పట్లోనే రాజాసింగ్ లేఖ రాశారు. దీనిపై బీజేపీ జాతీయ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా ఎదిగే అవకాశం ఉంటుందని నెలరోజుల క్రితం రాజాసింగ్ విడుదల చేసి లేఖ కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు కొనసాగిస్తుండగా కొంతమంది బీజేపీ పార్టీ నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రహస్యంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సమావేశం అవుతున్నారని, ఇది బీజేపీకి మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో మొదటి నుంచి పేరుకుపోయిన చాలా మంది నేతలను పార్టీ నుంచి బయటకు పంపించి వేయాలని, వాళ్లని పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. దాంతో పాటుగా పార్టీని తమ అయ్య జాగీరుగా భావిస్తున్న వారు బీజేపీలో చాలా మంది ఉన్నారని, వారంతో కొన్ని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే అంటూ ఆరోపణలు చేస్తూ లేఖను రిలీజ్ చేశారు రాజాసింగ్. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నవారి వివరాలు తనకు తెలుసని.. వారిపై త్వరలోనే బీజేపీ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు లేఖలో పేర్కొన్నా రాజాసింగ్. దీనిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

## ఛత్తీస్‌ఘడ్‌లో మావోలకు ఎదురుదెబ్బ



**పోలీసులకు లొంగిపోయిన 17మంది మావోలు**

బీజాపూర్,మార్చి13: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మందిపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్ల కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు. సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ.25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.

## మరోమారు భగ్గుమన్న పసిడి ధర



- రూ.600 పెరిగి రూ.89,450కి చేరిక

న్యూఢిల్లీ,మార్చి13: తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పైకెగసింది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన డిమాండ్ కారణంగా దేశీయంగా మరోసారి పసిడి ధర ఆకాశాన్ని తాకింది. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం 10 గ్రాముల 99.9 శాతం స్వచ్ఛమైన పుత్తడి ధర రూ.600 పెరిగి రూ.89,450కి చేరింది. ఫిబ్రవరి 20న పసిడి ధర రూ.89,450గా నమోదైంది. మళ్లీ దాదాపు 20 రోజుల తర్వాత బంగారం ధర మళ్లీ అదే స్థాయికి చేరిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అటు వెండి సైతం ఒక్క రోజులో కిలోకు వెయ్యి రూపాయలు మేర పెరిగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,00,200గా ఉన్న వెండి ధర రూ.1,01,200కు చేరింది. ఇది ఐదు నెలల గరిష్ఠానికి సమానం. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ఔన్సు ధర 2946 డాలర్లకు చేరింది. అమెరికాలో తాజాగా వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు పసిడి ధర పెరగడానికి కారణమయ్యాయి. అంచనాల కంటే తక్కువగా ద్రవ్యోల్బణం నమోదు కావడంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ కారణంతోనే బంగారం వైపు పెట్టుబడులు మళ్లుతున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో ప్రథమంగా సారీ డ్రాపింగ్ ఈవెంట్







**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**

హైదరాబాద్ వనస్థలిపురం మాంగళ్య షాపింగ్ మాల్‌లో గురు వారం ప్రథమంగా సారీ డ్రాపింగ్ కార్యక్రమం నిర్వహించారు. మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ మాట్లాడుతూ చీరకట్టు స్త్రీ అందాన్ని మరింత పెంచుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో మహిళలకు సరసమైన ధరలలో తీరొక్క డిజైన్ లలో వస్త్రాలు అందుబాటులో ఉంచామని తెలిపారు చెన్నైకి చెందిన ప్రముఖ సారీ డ్రాపర్ కవిత ప్రత్యేకంగా హాజరై చీరను నైపుణ్యంగా ధరించే విధానాన్ని ప్రద ర్శించారు. ఏ మోడల్ చీరకు ఎలా తయారు కావాలో మహిళలకు అవగాహన కల్పించారు. చీర కట్టుతోనే మహిళలకు మరింత అందాన్ని తెచ్చిపెడుతుందని, ఎలాంటి చీరలు ఎంచుకోవాలో వివరించారు. ఫ్యాషన్ డిజైనర్లు, బ్యూటీ పార్లర్ రంగ ప్రముఖులు ఈ ఈవెంట్‌ను ఆసక్తిగా గమనించి, మాంగళ్య షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం శివ, పుల్లూరు అరుణ్, తోనూపునూరి అరుణ్, ప్రముఖులు, వ్యాపారులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తెలంగాణ రైజింగ్‌కు
## మద్దతుగా నిలవండి

- జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



న్యూఢిల్లీ,మార్చి13: రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశారు. ఈసందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్టాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ సిగ్గుచేటని బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ శేఖర్ బాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో రైతుల గురించి మాట్లాడిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాపాలనలో ఇలా జరగడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షాలను ఎదుర్కొనే దమ్ము లేకనే ఇలా సస్పెండ్ చేశారన్నారు.

## అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు బైక్ పై వెళ్తున్న సాయికృష్ణ వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడికి బైక్ పై అభినవ్, అతని స్నేహితుడు శ్రీవర్ధన్ వెళ్తుండగా గుండ్లపల్లి వేదిక వద్దకు రాగా సాయికృష అతి వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కరీంనగర్ హాస్పిటల్ కి పంపించారు. అభినవ్ తండ్రి మధు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎస్ఎల్‌బీసీ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



మహబూబ్‌నగర్,మార్చి13: ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్‌లో సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించి.. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయక బృందాలతో ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ.. ఏ రోజుకు ఆ రోజు చేయాల్సిన పనులను అధికారులు సహాయక బృందాలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక బృందాలు ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్లను 24 గంటలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో నిమగ్నమై ఉన్నట్లు వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్ కటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తవ్వకాలు జరుగుతున్న డీ-1, డీ-2 ప్రాంతాల్లో సింగరేణి ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యల్లో టన్నెల్ బోరింగ్ మిషన్ భాగాలను తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు చెప్పారు. సహాయక చర్యల్లో రోబో వినియోగం తదితర పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. డీ-1, డీ-2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడవర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపినట్లు తెలిపారు. నిరంతరాయంగా డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ర్యాట్ మైనర్స్, కడవర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని.. టన్నెల్ లోపల సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## ఆమ్ ఆద్మీకి వరుస షాక్‌లు

- మనీష్ సిసోదియా, సత్యేందర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు
- రాష్ట్రపతి అనుమతి ఇచ్చినట్లు సమాచారం




న్యూఢిల్లీ,మార్చి13): ఆమ్ ఆద్మీ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలపై కేసుల నమోదుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఢిల్లీలోని పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంలో రూ.1300 కోట్ల మేర కుంభకోణం జరిగిందనే ఆరోపణలపై మనీష్ సిసోదియా, సత్యేందర్‌లపై ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి అనుమతి ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ 2400 తరగతి గదుల నిర్మాణంలో స్పష్టమైన అవకతవకలు ఉన్నట్లు కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) 2020 ఫిబ్రవరి 17న ఓ నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలోనే 2022లో ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఈ కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు సిఫారసు చేస్తూ ప్రధాన కార్యదర్శికి నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ హయాంలో మంత్రులుగా ఉన్న వీరిద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు సమాచారం. గతంలో మద్యం విధానం కేసులో సిసోదియా, మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్ అరెస్టయ్యి ఆ తర్వాత బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే.

## ఘనంగా లోక భూమారెడ్డి జన్మదిన వేడుకలు

- పదవులకు వన్నెతెచ్చిన మహామనిషి లోక భూమారెడ్డి
- అంతులేని ప్రజాభిమానం ఆయన సొంతం
- లోక నేత భూమారెడ్డి జీవన ప్రస్థానం పుస్తకావిష్కరణలో కంది శ్రీనివాసరెడ్డి



**శెనార్తి మీడియా, తలమడుగు:**

విజయ డైరీ మాజీ చైర్మన్ లోక భూమా రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామైన రుయ్యాడిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. లోక భూమారెడ్డి స్వీయ రచన లోకనేత భూమారెడ్డి జీవన ప్రస్థానం పుస్తకాన్ని కంది శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించి అభినందనలు తెలియజేశారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఇదేవిధంగా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మమేకమై వారి ఆదరాభిమానాలు చూరగొనాలని అభిలాషించారు. లోక భూమారెడ్డి పదవీలకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. తన ఊరు కోసం, ఈ ప్రాంతవాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన అహర్నిషలు కష్టపడ్డారన్నారు. పుట్టినగడ్డకు ఏదైన చేయాలి..తరాతరాలు తన సేవలను గుర్తించుకోవాలనే తలంపుతో ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారని అన్నారు. ఊరు అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. సవారీబంగ్లా, రోడ్లు వేయించి గ్రామం రూపురేఖలు మార్చడంలో సఫలీకృతులయ్యారన్నారు. కొందరు మాత్రమే తమ స్వార్థం చూసుకుంటారని, ఇంకొందరు మాత్రమే ప్రజా సేవ కోసమే అంకితమవుతారన్నారు. లోక భూమారెడ్డి కారణజన్ముడని ప్రశంసించారు. ఆయన సేవలు భావితరాలకు స్ఫూర్తినివ్వాలన్నారు. లోక భూమారెడ్డి ని వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, ఆయన అభిమానులు శాలువా తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే లు రాథోడ్ బాపురావ్, రేఖ శ్యామ్ నాయక్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రంగినేని మనీషా, భూమా రెడ్డి, వివిధ పార్టీ ల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..



### కిల్లర్ హీరోయిన్‌కు


# కర్ణాటక స్టేట్ అవార్డు

తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తాను చాటుతోంది కన్నడ నాయిక జ్యోతి పూర్వజ్. ఆమె ప్రస్తుతం సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్' లో నటిస్తోంది. విశేషం ఏమంటే ఆమె నటించిన కన్నడ చిత్రం 'వర్ణపతల' కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డులో రెండవ ఉత్తమ చిత్రంగా నిలచించింది. ఈ అవార్డు రావడం పట్ల జ్యోతి పూర్వజ్ హర్షం వ్యక్తం చేయగా, 'కిల్లర్' టీమ్ ఆమెను అభినందించింది. 'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ ప్రస్తుతం కిల్లర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్ గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి దీనిని నిర్మిస్తున్నారు. 'కిల్లర్' పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది.

### అనుపమ పరదా సినిమాలో

# సమంత గెస్ట్‌రోల్?

**ఆఆ సినిమా తర్వాత కలిసి ఇద్దరు నటన**



మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే .. మరో వైపు లేడీ ఓరియెంటడ్ సినిమాలతో ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ ఫిబ్రవరి 1996లో కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. 2015లో అల్ఫోన్స్ పుత్రన్ దర్శకత్వం వహించిన ప్రేమమ్ చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. మొన్నటి వరకు సినిమాల్లో పద్దతిగా కనిపించిన ఈ భామ ఇటీవల గ్లామర్ గేట్లు ఎత్తేసింది. మొన్నామధ్య వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన అందాలతో కవ్వించింది. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా పాపులర్ అయిన అనుపమ.. ప్రస్తుతం తెలుగులో పరదా అనే చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళంలో మరిసెల్వరాజ్ దర్శకత్వంలో నటుడు ధ్రువ్ విక్రమ్ నటించిన బైసన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రీసెంట్ గా అశ్వంత్ మరిముత్తు దర్శకత్వంలో నటుడు ప్రదీప్ రంగనాథన్ జోడిగా డ్రాగన్ అనే చిత్రంలో నటిస్తుంది. సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా అనుపమ సినిమా పరదా సినిమాలో ఓ సర్ ప్రైజ్ ఉంటుందని తెలుస్తుంది. పరదా సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ కూడా నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరో కాదు. సౌత్ స్టార్ బ్యూటీ సమంత. ఫిలిం సర్కిల్‌లో వినిపిస్తున్న వార్తల ప్రకారం పరదా సినిమాలో సమంత ఓ కీలక పాత్రలో కనిపించనుందని అంటున్నారు. గతంలో అనుపమ సమంత ప్రధాన పాత్రలో నటించిన అఆ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. అనుపమకు ఇదే తెలుగులో మొదటి సినిమా. ఆతర్వాత ఇప్పుడు మరోసారి అనుపమ, సమంత కలిసి స్క్రీన్ పై సందడి చేయనున్నారని అంటున్నారు. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.



### అమీర్‌ఖాన్ ఇంటికి వెళ్లిన

# సల్మాన్, షారూఫ్ ఖాన్‌లు

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమీర్ ఖాన్ మార్చి 14న తన 60వ పుట్టినరోజును జరుపుకోనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయనకు ప్రీ బర్త్‌డే విషెస్ తెలుపుతున్నారు సినీ ప్రముఖులు. అయితే ఆమీర్ ఖాన్ 60వ పుట్టినరోజు గుర్తుండిపోయే విధంగా ఉండేందుకు బాలీవుడ్ స్టార్ హీరోలు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ అతడికి కలిసినట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి ఆమీర్ ఖాన్‌ని కలిసి అతడి ఇంటినుంచి బయటకు వస్తున్న సల్మాన్, షారుఖ్ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒక వీడియోలో సల్మాన్ ఖాన్ అమీర్ ఇంటి నుండి బయటకు వస్తున్నట్లు కనిపించగా.. ఇందులో అమీర్ ను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు సల్మాన్. ఇంకో వీడియోలో షారుక్ వెళ్లబోతుండగా.. ఆమీర్ షారుక్ ముఖంని కవర్ చేసుకోమని చెప్పడం.. షారుఖ్‌ని సెక్యూరిటీ సిబ్బంది కవర్ చేయడం చూడవచ్చు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలను మీరు చూసేయండి. సినిమాల విషయానికి వస్తే.. సల్మాన్ ఖాన్ ప్రస్తుతం సికందర్ సినిమాలో నటిస్తుండగా.. ఆమీర్ సితారే జమీన్ పర్ అనే చిత్రంలో నటిస్తున్నాడు. షారుఖ్ ప్రస్తుతం కింగ్ అనే ప్రాజెక్ట్‌లో నటిస్తున్నట్లు సమాచారం.





### రాములమ్మకు

# సొంతకారు కూడా లేదట..?

సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన విజయశాంతి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ సందర్భంగా ఆమె దాఖలు చేసిన అఫిడవిట్లలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. కోట్లు ఆస్తులున్న విజయశాంతికి సొంత కారు లేదని డాక్యుమెంటేషన్‌లో పేర్కొండడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఎందుకంటే స్టార్ యాక్టర్స్ అంటే లగ్జరీ కార్లు గుర్తుకొస్తాయి. మరి స్టార్ హీరోయిన్ గా దాదాపు 30 ఏళ్ళు సినీ కెరీర్ లో తన నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న విజయశాంతి లేడీ అమితాబ్ గా, లేడీ సూపర్ స్టార్ గా ఖ్యతిగాంచారు. సినీ కెరీర్ పీక్ స్టేజ్ లో ఉండగానే రాజకీయాల్లో అడుగు పెట్టి.. తెలంగాణ తల్లి అనే పార్టీని స్థాపించి తర్వాత తన పార్టీని బిఆర్ఎస్ పార్టీలో విలీనం చేసింది. బీజేపీ, బీఆర్ఎస్ లో పని చేసిన విజయశాంతి 2023 ఎన్నికల వేళ కాంగ్రెస్ గూటికి చేరింది. ఇప్పుడు చివరి నిమిషంలో ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్నారు. సినీ నటి, నిర్మాత, రాజకీయ నాయకురాలు అయిన విజయశాంతి 30 సంవత్సరాల సినీ కెరీర్‌లో వివిధ భాషా చిత్రాలలో సుమారు 180 సినిమాల్లో నటించారు. కర్తవ్యం సినిమాలో విజయశాంతి నటనకు గానూ జాతీయ సినిమా ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సీనియ నటి, రాజకీయ నేత దగ్గర కనీసం కారు కూడా లేదని తెలిసి ఆశ్చర్యపోతున్నారు. విజయశాంతి, శ్రీనివాస్ ప్రసాద్ దంపతుల దగ్గర ఉన్న మొత్తం స్థిరాస్తుల విలువ రూ. 115 కోట్లు.

**స్థిరచరాస్తుల విలువ ఎంత అంటే..**

హైదరాబాద్, చెన్నై లో ఉన్న భూముల గురించి తెలుపుతూ.. విజయశాంతి పేరు మీద 67.5 కోట్ల విలువ చేసే భూములున్నాని.. తన శ్రీనివాస్ ప్రసాద్ పేరు మీద రూ.45 కోట్లు విలువ చేసే భూములు ఉన్నాయన్నారు. అంతేకాదు ఈ లేడీ సూపర్ స్టార్‌పేరు మీద బ్యాంక్‌లో కోటి రూపాయలు డిపాజిట్ ఉన్నట్లు 2 కిలోల బంగారు నగలు ఉన్నాయని.. వాటి విలువ సుమారు కోటీ 98 లక్షలు ఉంటుందని వెల్లడించారు. తన దగ్గర నగదు 5 లక్షల 92 వేలు ఉన్నాయని.. తన శ్రీనివాస్ ప్రసాద్ దగ్గర 30 వేల నగదు ఉన్నాయని పేర్కొన్నారు.



# ప్రభాస్ అంటే ఆమాత్రం కేజ్రీ ఉంటుంది

కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రభాస్ తన క్రేజ్‌ని అమాంతం పెంచుకుంటున్నాడు. మధ్యలో కొన్ని ఫ్లాపులు పలకరించిన తర్వాత వరసగా హిట్స్ అందుకుంటున్నాడు. బాహుబలి సినిమాతో వరల్డ్ వైడ్ గా అభిమానులను సంపాదించుకున్న ప్రభాస్.. సలార్, కల్కి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకొని తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాల లైనప్ చూస్తే దుమ్ము రేపడం ఖాయం. ప్రస్తుతం మారుతితో రాజా సాబ్ అనే సినిమా చేస్తున్న ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డితో 'స్పిరిట్'.. సలార్ 2, కల్కి 2 చిత్రాలలో నటించనున్నారు. ఇక ప్రభాస్ నటించిన సలార్ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా భారీ యాక్షన్ డ్రామాగా రూపొంది ప్రభాస్ అభిమానులకి మంచి ఫీస్ట్ అందించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 21న రీరిలీజ్ చేయబోతున్నారట. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. పది అంటే పది నిమిషాల్లో థియేటర్లో నాలుగు షో టికెట్స్ సేల్ కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ సిటీలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్లలో సుదర్శన్ హాలులో సలార్ చిత్రం రీరిలీజ్ అవుతుంది.

## మోహన్‌బాబుపై సంచలన ఆరోపణలు

ఖమ్మం జిల్లా సత్యనారాయణపురానికి చెందిన చిట్టిమల్లు నటుడు మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివారు జల్‌పల్లి గెస్ట్ హౌస్ ఒకప్పటి హీరోయిన్ సౌందర్యదని.. దాన్ని నిర్మాత మోహన్‌బాబు బలవంతంగా లాక్కున్నారన్నది చిట్టిమల్లు వాదన. ఆ గెస్ట్‌హౌస్‌ను తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని అనాథ ఆశ్రమానికి లేదంటే మిలటరీకి అప్పగించాలని డిమాండ్ చేశాడు. అలాగే మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌తో పాటు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. చిట్టిమల్లు ఆరోపణలపై సౌందర్య భర్త రఘు స్పందించారు. సౌందర్య ఆస్తిని మోహన్‌బాబు లాక్కున్నారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని లెటర్ రిలీజ్ చేశారు. మోహన్ బాబుతో సౌందర్య ఎలాంటి భూ లావాదేవీలు జరపలేదని స్పష్టం చేశారు.

## చాహల్‌తో డేటింగ్‌పై మహ్‌వశ్ పోస్ట్

టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మళ్లీ ప్రేమలో పడ్డట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. యూట్యూబర్, రేడియో జాకీ మహ్‌వశ్‌తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు బీ టౌన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్‌గా దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడం వలన ఈ వార్తలకు బలం చేకురింది. మహ్‌వశ్ పెట్టిన ఒక పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. రీసెంట్‌గా తనకు బెస్ట్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవార్డు రావడంపై స్పందించింది. 'నేను ఈ స్థాయికి చేరడం చూస్తే చిన్నప్పటి మహ్‌వశ్ ఎంతో సంతోషిస్తుంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతి. మనం మన పనిని నిజాయితీగా చేస్తూ ముందుకు వెళ్లాలి." అంటూ రాసుకోచ్చింది.

### తెలుగువారికి

## నన్ను దగ్గర చేసిన సినిమా

# యుగానికి ఒక్కడు : కార్తీ



తమిళ నటుడు కార్తీ నటించిన క్లాసిక్ చిత్రాలలో 'యుగానికి ఒక్కడు' (తమిళంలో 'ఆయిరత్తిల్ ఒరువన్') ఒకటి. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వ్యాలీ కార్పొరేషన్ బ్యానర్‌పై ఆర్. రవీంద్రన్ నిర్మించారు. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా జెరెమయ్యా ప్రధాన పాత్రల్లో నటించారు. హిస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం 2010లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. ఇక ఇదే సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు కార్తీ. అయితే ఇదే సినిమాను దాదాపు 15 ఏండ్ల సంవత్సరాల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. మార్చి 14న ఈ చిత్రం రీ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో పాల్గోన్నాడు కార్తీ. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. నన్ను తెలుగువారికి దగ్గర చేసిన చిత్రం యుగానికి ఒక్కడు. నేను ఎన్నో సినిమాలు చేసిన కూడా యుగానికి ఒక్కడు చిత్రం నా కెరీర్‌లో టాప్‌లో ఉంటుంది. దాదాపు 3 ఏండ్లు పగలు రాత్రి కష్టపడి చేసిన సినిమా అది. ఇది బాక్సాఫీస్ ట్రెండ్ సెట్టర్. ఈ మూవీ మ్యూజిక్ పరంగా కావచ్చు, సౌండ్ ఎఫెక్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ ఇలా అన్ని విభాగాలలో సత్తా చాటింది. ఈ సినిమాలో వచ్చిన ఎవర్రా మీరంతా అనే డైలాగ్ ప్రస్తుతం ఒక ట్యాగ్‌లైన్‌గా మారిపోయింది. అందరూ థియేటర్‌కి వెళ్లి సినిమాను ఎంజాయ్ చేయడంటూ కార్తీ చెప్పుకోచ్చాడు.

# ఎన్టీఆర్ ధరించిన గడియరం ధర ఎంతో తెలుసా..?




జూనియర్ ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒక్కో సినిమాకు వందల కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటారు. తారక్ జీవనశైలి చాలా విలాసవంతమైనది. ఎన్టీఆర్‌కు హైదరాబాద్ లో విలాసవంతమైన ఇల్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బెంగళూరు, ముంబై, దుబాయ్ సహా అనేక ప్రదేశాలలో ఆస్తులు ఉన్నాయి. ఆయనకు లగ్జరీ కార్ల పెద్ద సేకరణ కూడా ఉంది. ఎన్టీఆర్ ధరించిన వాచ్ విలువ కోట్ల రూపాయలు. ఎన్టీఆర్ దగ్గర కోట్ల విలువైన గడియారాల సేకరణ ఉంది.అప్పుడప్పుడు ఏదో ఒక రకమైన చాలా ఖరీదైన గడియారాలను ధరిస్తారు. ప్రస్తుతం హిందీ చిత్రం 'వార్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్న నటుడు ఎన్టీఆర్ ముంబై విమానాశ్రయంలో చాలా స్టైలిష్‌గా కనిపించాడు. ఎన్టీఆర్ కొత్త లుక్ తో పాటు, ఆయన ధరించిన వాచ్ కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ ధరించిన వాచ్ ఖరీదు 7.47 కోట్ల రూపాయలు! ఎన్టీఆర్ రోల్స్ రాయిస్ కారు కంటే ఖరీదైన వాచ్ ధరించాడు. ఎన్టీఆర్ రిచర్డ్ మిల్లె 40-01 టర్బైన్ మెక్‌లారెన్ స్పీడ్‌డయల్ వాచ్ ధరించాడు. భారతదేశంలో దీని ధర 7.47 కోట్ల రూపాయలు. విదేశాల నుండి దిగుమతి చేసుకుని, అన్ని పన్నులు చెల్లించిన తర్వాత, దాని ఖర్చు 8 కోట్లు దాటుతుంది. ఈ వాచ్ చాలా అరుదు. ఈ మోడల్ వాచ్ ప్రపంచవ్యాప్తంగా 106 మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒకటి జూనియర్ ఎన్టీఆర్ చేతిలో ఉంది. మెక్‌లారెన్ కారు నుండి ప్రేరణ పొందిన ఈ గడియారం ప్లాటినం, చైనాను కూడా ఉపయోగిస్తుంది. ఈ గడియారం అరుదైన యంత్రాంగాన్ని ఉపయోగించి తయారు చేయబడింది. రిచర్డ్ మిల్లె కంపెనీ ఒక గడియారాన్ని నిర్మించడానికి 2800 గంటలు పట్టిందని చెబుతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY V. SAMPATH PRINTED AT SHARADHA PRINTERS, SHASTRI ROAD, KARIMNAGAR- 505001, KARIMNAGAR DISTRICT,Cell: 9391343644, TELANGANA STATE, PUBLISHED AT H.NO.2-10-2126, MANKAMMATHOTA, BHAGYANANAR, KKARIMNAGAR, -505002, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE. EDITOR : V SAMPATH. TELTEL/2023/89146, EMAIL :shenarthimedia@gmail.com